# "ఆండాళ్ళమ్మ" కు కొత్త ముందుమాట

(ఇది 6వ ముద్రణకు రాసినది)

---

భర్త ఆఫీసునుంచి రాగానే భార్య సన్నని వేళ్ళతో "చురుగ్గా" బూట్లు విప్పడం (భార్యల చురుకుదనం అంతా భర్తల బూట్లు విప్పడానికీ, బిగించడానికీ గావున్ను!)—

ఆ భర్త, భార్య వొండిన వంటలు తింటూ హాస్యం పేరుతో వాటికి రకరకాల పేర్లు పెట్టడం (భార్య చేసిన పనుల్ని ఎలాగో వొకలాగు కించ పరచాలి. సాధారణంగా భార్యలు చేసేపనులు వంటలు చెయ్యడమే కాబట్టి, ఆ వంటలమీదే తమ హాస్యరసం అంతా వొలికించి వేళాకోళా లాడకపోతే అది "భర్తతనం" కానే కాదు.)—

భార్యల్ని వెటకారం చెయ్యడానికి మాత్రమే వుపయోగపడే "భార్యామణి" "భార్యా రత్నం" వంటి మాటల ప్రయోగం—

"లైన్ క్లియరింగ్ కోసం కాబోలు ఆండాళ్ళమ్మగారు అరుస్తూ రావడంతో శృంగార ఘట్టం కాస్తా చెదిరిపోయింది." "శృంగారం అనే

దాన్ని వికారం చేసేటటువంటి" ఇటువంటి వొకటి రెండు (అప) హాస్యోక్తులూ—

పద్మ మహా మూర్ఖంగా 'నిద్రపోతోన్న' పిల్లాణ్ణి లేవదీసి ఆండాళ్ళమ్మ చేతి కివ్వడం—

—ఈ రకం వాతావరణం లేకపోతే బాగుండేది ఈ కథ.

భర్త, భార్యకు రోజూ పువ్వులు తేకపోతే; భార్య, భర్త బూట్లు విప్పకపోతే-అది "ఆదర్శ దాంపత్యం" కాదనే అభిప్రాయాల్ని ఈ కథ కలిగిస్తే, అది ఎంత పొరపాటో!

సరే! ఇక కథానాయకురాలయిన ఆండాళ్ళమ్మగారి సంగతి చూద్దాం.

చివరికి, కథ పూర్తయ్యే సరికి,ఆండాళ్ళమ్మమీద సానుభూతి కలగక పోగా, "తగిన శాస్తి అయిందిలే" అని కొంచెం సంతోషం కూడా కలుగు తుం దనుకుంటాను.

ఆండాళ్ళమ్మ—తన చుట్టూ వున్న వ్యక్తులందరితోనూ చాలావరకు దుర్మార్గంగానే ప్రవర్తిస్తుంది. ఏ ఇద్దరు వ్యక్తులు స్నేహంగా వున్నా భరించలేదు. భార్యా - భర్తల్నయినా సరే, తల్లీ - పిల్లల్నయినాసరే తన చాతుర్యమంతా వుపయోగించి విడదియ్య వలసిందే. ఎదటివాళ్ళు ఇబ్బం దుల్లో పడి కొట్టుకుంటూ వుంటే ఆండాళ్ళమ్మ చాలా సంతోషిస్తుంది. సాటి వ్యక్తులతో ఆప్యాయంగా మసలడం, ప్రేమ చూపడం - అనే ఊహలకే తావులేదు ఆమె మనసులో. ఆమెకు ఎవర్ని చూసినా అయిష్టమే. ఎవర్ని చూసినా అసూయే!— ఏమిటీ స్వభావం? ఎలా వొచ్చిందీ స్వభావం అందరూ ఇంతేనా? ఆండాళ్ళమ్మ మాత్రమే ఈ రకమా?

"అందరూ అంతే"— అనడం చాలా ఘోరం లాగా కనపడు తుంది. కానీ, ఏమీ దాపరికం లేకుండా వొప్పుకోదలిస్తే మాత్రం అందరూ అంతే. వొకే విధమయిన సమాజ పరిస్థితుల్లో జీవిస్తోన్న మనుషు లందరికీ దాదాపు వొకేరకం స్వభావాలు ఏర్పడతాయి. ఆ పరిస్థితుల మధ్యనే మళ్ళీ ఎవరి వ్యక్తిగత వాతావరణంవల్ల వారికి కొంత వేరు వేరు స్వభావాలు కలుగుతాయి.

ఆండాళ్ళమ్మ ఎటువంటి సమాజ వాతావరణంలో, ఎటువంటి నీతి నియమాల్లో, ఎటువంటి ఆచార వ్యవహారాల్లో పుట్టి పెరిగిందో — అటు వంటి సమాజ వాతావరణంలోనే పుట్టి పెరిగిన ఇతర వ్యక్తులకు కూడా ఆండాళ్ళమ్మకు ఏర్పడిన స్వభావం వంటి స్వభావాలే ఏర్పడతాయి.

అయితే— ఆండాళ్ళమ్మ చిన్నతనంలో పరిస్థితులూ, ఆండాళ్ళ మ్మని పెంచిన పెద్దల ప్రవర్తనా పద్ధతులూ, ఆండాళ్ళమ్మ చదువు సంధ్యలూ, ఆండాళ్ళమ్మ ఆలోచనా విధానం— సరిగ్గా అదే విధంగా ఇతర వ్యక్తుల జీవితాల్లో వుండడం జరగదు కాబట్టి, ఆండాళ్ళమ్మ స్వభా వానికీ, ఇతరుల స్వభావాలకీ కొంత తేడా ఏర్పడడంకూడా జరుగుతుంది.

అంటే, వొకేరకం సమాజంలో వ్యక్తు లందరికీ వొకే రకం స్వభావం ఏర్పడుతూనే, ఎవరి వ్యక్తిగత పరిస్థితుల్నిబట్టి వారి వ్యక్తిగత స్వభావాలు కూడా ఏర్పడతాయి.

ఈ సమాజంలో "అసూయ" అనేది తప్పనిసరిగా ఏర్పడే ఒక ముఖ్య లక్షణం. వొక వ్యక్తికి వున్న అవకాశాలు రెండో వ్యక్తికి లేక పోవడం, రెండో వ్యక్తి సుఖాన్ని దృష్టిలో పెట్టుకోకుండా, తన సుఖమే తను ఆలోచించుకోవలసి రావడం—ఈ పరిస్థితులే వ్యక్తి స్వభావంలో "అసూయ"ని కల్గిస్తాయి.

అయితే, సమాజం అలా వున్నప్పటికీ, తమ కుటుంబ పరిస్థితుల్ని బట్టీ, తను నేర్చుకున్న ఆలోచనా విధానాన్ని బట్టీ, వొక్కో వ్యక్తిలో ఈ 'అసూయ' చాలా తక్కువ పాలులో వుంటుంది. వొక్కో వ్యక్తిలో చాలా అధికంగా వుంటుంది. అలాగే మిలిగిన లక్షణాలన్నీ కూడా.

ప్రతి వ్యక్తికీ చిన్నతనంనించీ ఎవరి స్వార్థం వారు చూసుకోవల సిన అవసరమేగానీ, పరోపకారానికి సమిష్టి సుఖానికి ప్రోత్సహించే జీవిత విధాన మేదీ సమాజంలో లేదు.

ఆండాళ్ళమ్మలో వున్న దుర్గుణాలు కాస్త ఎక్కువ తక్కువ తేడా లతో అందరిలోనూ వున్నాయి, అందరి స్వభావాలకూ మూలం వొకే సమాజం కాబట్టి.

ఆండాళ్ళమ్మ మరింత దుర్మార్గంగా తయారు కావటానికి కొంత ప్రత్యేక కారణం, ఆమె ఆస్తి. ఆమెకు పొలం వుంది. డబ్బు వుంది. బంగారం వుంది. ఆ పొలమూ, ఆ డబ్బూ, ఆ బంగారమూ లేని వ్యక్తుల్ని ఎందర్నో ఆమె చూస్తోనే వుంది. వాటి కోసం ఆశపడే బంధువుల్ని ఎందర్నో కూడా చూస్తోనే వుంది. ఇతరులకు ఎందరికో లేని, ఎందరో ఆశప ే ఒక "ప్రత్యేకత" (ఆస్తి) తనకే వుందనే గర్వం ఆండాళ్ళమ్మకు కలగడంలో అసహజ మేమీ లేదు.

ఆండాళ్ళమ్మ ఆస్తి కోసం కొందరు బంధువులు లోలోపల ఆశ పడుతూ, ఆండాళ్ళమ్మ దగ్గర వినయంగా, అణకువగా ప్రవర్తిస్తూ వుండడం చేత, అందరికన్నా తనకెంతో ఆధిక్యత వున్నట్టు ఆండాళ్ళమ్మ భావిస్తుంది. దానికి తగ్గట్టే ఆమె అందరిమీదా పెత్తనం చేసే దృష్టితో, ఆజ్ఞాపించే

దృష్టితో, ప్రవర్తిస్తూ వుంటుంది. తనకు ఆస్తి వుందనే ధైర్యం వల్ల,(తనకు వుండడమే కాదు. ఇతరులకు లేకపోవడం కూడా ఆమె ఆధిక్యానికి కారణం), ఇతరులు తన అడుగుపాజ్ఞలకు లొంగి, తన దయ సంపాదించుకో గలగాలి అనుకుంటుందే గానీ, తను కూడా ఇతరులతో "మంచితనం"గా ప్రవర్తించాలని అనుకోదు. ఏ వొక్కరి ప్రేమ కోసమూ తాపత్రయ పడదు.

వొక వ్యక్తికి ఆస్తి వుండడం, మరి కొందరికి ఏమీ లేక ఆ ఆస్తి కోసం ఆశ పడడం—అసలు ఈ రకం పరిస్థితే లేదనుకోండీ. అప్పుడు, అండాళ్ళమ్మకి ఇతరులకన్నా ఏ ప్రత్యేకతా వుండదు. ఆమె బంధువులు కూడా ఆమె ఆస్తి కోసం తాపత్రయ పడవలసిన అవసరం వుండదు. సమాజంలో అందరూ ఒకే స్థితిలో, అన్ని అవసరాలూ సమాజం తీర్చే స్థితిలో, సమాజ రక్షణలో వుంటారు అప్పుడు ఆండాళ్ళమ్మకు వొక ప్రత్యేకత ఎక్కణ్నించి వొస్తుంది? ఆస్తి ప్రత్యేకతే లేకపోతే, ఆ ఆస్తి బలంతో వొచ్చిన మూర్ఖత్వం, అందరూ తన చుట్టూ తిరుగుతారనే అహంకారం, సాటి వ్యక్తుల మంచితనాన్ని గుర్తించలేని దుర్మార్గం—ఈ లక్షణా లన్నీ ఎక్కణ్ణించి వొస్తాయి?

"ఆస్తి లేని వ్యక్తులు మాత్రం అసూయా పరులుగా, దుర్మార్గులుగా లేరా?" అన్న ప్రశ్న రావచ్చు. కానీ, ఈ సమాజం ఇలాగే వుండి, అంటే ఎవరి స్వార్థం వారు చూసుకోవలసిన పరిస్థితులే వుండి, వొక వ్యక్తికి ఆస్తి లేకపోయినంత మాత్రాన, ఆ వ్యక్తికి గొప్ప సద్గుణాలు ఏర్పడతాయని అర్థం కాదు. ఎవరి స్వార్థం కోసం వారు తాపత్రయ పడవలసిన అగత్యం లేనప్పుడే వ్యక్తులు నిస్వార్థంగా తయారవుతారు.

ఆండాళ్ళమ్మ చిన్నతనం నించీ పెరిగిన సమాజ వాతావరణం, తర్వాత ఆమె ఆస్తి బలం—ఆమెను చెడ్డదాన్ని చేశాయి.

ఆండాళ్ళమ్మ మీద కోపం రావడం అంటే - ఆమె అలా తయారవ్వడానికి కారణం అయిన సమాజ పరిస్థితుల మీద కోపం రావడమే.

గృహ జీవితంలోగానీ, సమాజ జీవితంలోగానీ, స్త్రీ పురుషులు సద్గుణాలు నేర్చుకుని, ఉత్తమంగా ప్రవర్తించడాని కేమీ అవకాశాలు లేవు. ఆజన్మాంతం మూర్ఖత్వంలో, అజ్ఞానంలో, అసూయా - ద్వేషాలలో మునిగి వుండే పరిస్థితులు కల్పించే సమాజంలో 'ఆండాళ్ళమ్మలు' (అటువంటి స్వభావాలు) తయారుగాక తప్పదు.

రంగనాయకమ్మ.
24-12-1975

# అందాళ్ళమ్మగారు

శ్రీ శ్రీ పార్థసారథి ఆ సాయంత్రం ఆఫీసునుంచి దారిలో పువ్వులు కొనుక్కొని హుషారుగా ఈల వేసుకుంటూ ఇంటికొచ్చాడు. పద్మ బాబు నెత్తుకొని చిరునవ్వుతో ఎదురువచ్చింది. పువ్వులు భార్యామణి కందించి, కొడుకు నెత్తుకొని ముద్దులాడుతూ కుర్చీలో కూర్చున్నాడు సారథి. పువ్వులు టేబుల్ మీద వుంచి భర్తగారి బూట్లు విప్పటంలో నిమగ్నురాలైంది పద్మావతి. ఇంచుమించుగా అది ప్రతి సాయంత్రం జరిగే సన్నివేశం. పద్మ సన్నటి వేళ్ళతో చురుగ్గా బూట్లు విప్పుతోంది. "నీ పతిభక్తికి మెచ్చితిని పద్మావతీ! ఏదైనా వరము కోరుకొనుము" పతిదేవుడైన పార్థసారథి భార్యామణి సేవకు సంతోషించి, వరం ఇవ్వటానికి సంసిద్ధుడు అయ్యాడు.

"అవసరంలేదు ప్రభూ! ఉత్తుత్తి వరాలు రోజుకు రెండేసీ, మూడేసీ ఇచ్చేస్తూంటే, ఏం చేసుకోను?" సవినయంగా సకారణంగా తిరస్కరించింది పద్మావతి నవ్వుతూ.

సారథి ఉసూరుమన్నాడు. "అయితే వద్దనెదవా?"

"వద్దు ప్రభూ! వద్దు వద్దు!"

"తరువాత చింతించెదవు బాలా! బాగుగా...."

"చాలుకాని- కాళ్ళు కడుక్కొని రద్దురూ! హాస్యాలకేం? పెంచిన కొద్దీ పెరుగుతాయి." అంటూ బూట్లు టేబుల్‌కిందికినెట్టి లేచింది పద్మ.

"అయ్యో! అంత కోపం అయితే ఎట్లా అమ్మాయ్?" అంటూలేచి బాబును కుర్చీలో కూర్చోబెట్టి బట్టలు మార్చుకుని దొడ్లోకెళ్ళి కాళ్ళుకడుక్కొని, సారథి వచ్చేసరికి అల్పాహారం, మంచినీళ్ళు తయారుచేసిందిపద్మ.

"ఓ! ఈపూట టిఫెన్ చేశావా? ఏం పేరు పెట్టావ్?"

పద్మ నవ్వింది. సారథి బాబుని వొళ్ళో కూర్చో బెట్టుకుని టిఫెన్ కావిస్తూంటే, తను పువ్వులు గుచ్చుకుంటూ పక్కన కూర్చుంది.

"ఇవాళ పూలు తాజాగావున్నాయి" అంది.

"అవును. ఇవ్వాళ పాలకాయలు కూడా...."

"నయం, అవి గవ్వలు."

"ఓహ్! వీటికి గవ్వలని పేరు పెట్టావా? భగవాన్! మా ఆవిడకేం నేర్పు ప్రసాదించావయ్యా. గవ్వలు పాలకాయల్లా, పాలకాయలు పకోడీల్లా, పకోడీలు పుణుకుల్లా, పుణుకులు గవ్వల్లా, ఓహో! ఏం చెప్పను? ఒక్క వంటని అనేక రకాల్లో, అనేక రకాలని ఒక్క వంటలో చేసి తినిపించ గల భార్యామణి గల నేనెంత భాగ్యశాలిని!" నీరసపడ్డాడు.

పద్మ నవ్వింది. "ఎంత సొద వెళ్ళబోసుకున్నా మీ భాగ్యానికేం కొదువ లేదుగానీ, గోరంతలు కొండంతలు చేసే మీ వంటి భర్త కలిగిన నేను మాత్రం నిజంగా దురదృష్టవంతురాల్ని" నిట్టూర్చింది.

సారథి అలిగాడు. సగం తిన్న గవ్వ పూర్తిగా నోట్లో పడేసుకొని మరి తినటం ఆపేసి నోరు మూసుకున్నాడు.

"మీరు నన్ననగా లేంది, నేను తిరిగి అంటే అలగటందేనికి?"

"నువ్వు మంచిదానివీ, నేను అదృష్టవంతుణ్ణీ- అన్నాను నేను. నువ్వేమో నేను మంచివాణ్ణి కానంటున్నావ్. మరి అలగనా? నాకు గవ్వలూ వద్దు; పాలకాయలూ వద్దు. అసలు అన్నమే వద్దు."

"మంచినీళ్ళు?"

"వద్దు."

"ఎన్నిరోజులవరకో చెప్పండి. నా కొక్కదానికే వంట చేసు కుంటాను."

సారథి దిక్కమొహం వేసుకున్నాడు- "చూశావా? మొగుణ్ణి కదా? నేను అలిగితే నువ్వు చూస్తూ వూరుకుంటావా?"

"మరేం చేసేది?"

"బ్రతిమాలవూ?"

"నాకు చేత కాదు బాబూ!"

"చూశావా? అబద్ధాలాడుతున్నావ్! నీకు బ్రతిమాలటం వచ్చు. రాదంటున్నావ్! బ్రతిమాలవూ? తినమని బ్రతిమాలవూ? అన్నీ తినేస్తాను.

గవ్వలు తినేస్తాను, అన్నం తినేస్తాను, మంచినీళ్ళు తినేస్తాను."

"మరెప్పుడూ ఇలాంటి శపథాలు చెయ్యకుండా వుంటారా?"

"ఉంటాను. చెయ్యకుండా వుంటాను. ఎప్పుడూ చెయ్యకుండా వుంటాను. బ్రతిమాలవూ? గవ్వలు తినమని బ్రతిమాలవూ?"

"సరే అయితే! మీరు తినటం మానేస్తే నేను సహించలేనండీ! మీరు అన్నం మానేస్తే నేను చచ్చిపోతానండీ! మీరు మంచినీళ్ళు తాగకపోతే నా వూపిరి గడ్డకట్టేస్తుందండీ! ఈ ఒక్కసారికీ నన్ను క్షమించి, అన్నీ తినెయ్యరూ? ఈ ఒక్కసారికీ మన్నించరూ?"

"అంత జేలవైపోతావేం బాలా? నీ తప్పిదం వప్పుకున్నావు. అంతే చాలు! నిన్ను క్షమిస్తాను, గవ్వలన్నీ తినేస్తాను. ఇంకా తీసుకురా! తినేస్తాను! నా క్షమాహృదయాన్ని రుజూ చేస్తాను. నా గుండెల్లో నవనీతాన్ని చూపిస్తాను. పళ్ళెంలో గవ్వలన్నీ—"

పద్మ విరగబడి నవ్వడం మొదలు పెట్టింది. సారథి అదేం పట్టించుకోకుండా గుప్పెడు గవ్వలు నోట్లో పోసుకున్నాడు.

"వోవోయ్! నవ్వావ్ మహా!"

"నేనేదో తప్పుచేసి మిమ్మల్ని బ్రతిమాలుతున్నట్టూ, మీరేమో జాలి పడి క్షమించినట్టూ-ఏం పోజు పెడతారు!"

"ఇక ఆ చాప్టర్ ఖతమ్ హోగయా! మరేవైనా కబుర్లు చెప్పు "

"ఏదీ, చెబుదాం అనుకొంటే మీ నాటకం సరిపోయింది. మీ కేదో ఉత్తరం వచ్చింది. చూడండి డెస్కులో పడేశాను."

"ఎక్కణ్ణుంచేమిటి?" అంటూ సారథి డెస్కులోంచి కవరు తీశాడు. అడ్రస్ రైటింగుచూస్తూ, మొహం ప్రశ్నార్థకంగా మార్చుకున్నాడు. "ఎవరిది చెప్మా? కొత్త రాతలా ఉంది!"

"తినబోతూ రుచి అడుగుతారేం? చించి చూడరాదూ?" అంది పద్మ.

"పాయింటే! ఇదిగో, నీ గొప్పసలహాకో పాలకాయ, కాదు కాదు-గవ్వ కాబోలు" అంటూ సారథి భార్యామణి నోటికో గవ్వ అందించబోయాడు.

"నాకేం అక్కర్లేదు. నేను చేస్తూనే బోలెడు తిన్నాను" అంది పద్మ.

"ఓసి దురాత్మురాలా! నీ పతివ్రతా ధర్మం మండినట్టేవుంది. భర్తకు

వడ్డించకుండా ముందే బోలెడు తినేస్తావటే?" పార్థసారథి నిటారుగా కూర్చుని భార్యకేసి తీక్షణంగా చూస్తూ చాలా కోపం చేసుకున్నాడు.

పద్మావతి అతితేలిగ్గా— "సంతోషించాంలెండి" అనే సరికి అంత ఉగ్రనరసింహమూ నీళ్ళుగారిపోయింది. బింకంగా- "ఈ తప్పిదం క్షమించి తిని. మరి ఎన్నడూ భర్తకు పెట్టక మునుపే బోలెడు తినకు" అంటూ యథారూపాని కొచ్చేశాడు.

"అలాగే స్వామీ! ఇంతకూ ఉత్తరం చదవటం ఏమైనా వుందా?"

"ఎందుకు లేదూ? ఉంది. వాళ్ళు బేడార్థణా తగలేసుకు రాసినందుకైనా.... ఒకసారి చదివి పారేస్తే...." అంటూ కవరు చించాడు.

"చిరంజీవి పార్థుణ్ణి....ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధిగా దీవించి.... మీ పెద్దమ్మ ఆండాళమ్మ వ్రాయించు ఉత్తర మేమనగా...."

"ఎవరికి పెద్దమ్మ? ఆండాళ్ళమ్మ!" సారథి విస్తుబోయాడు.

"అయ్యో! అంతపొడుగున ఆశీర్వాదిస్తూ రాస్తే ఆ పెద్దమ్మ ఎవరో తెలీనే తెలీనా?" అంది పద్మ పూలు గుచ్చటం ఆపి, ఉత్తరంలోకి చూస్తూ.

"నిజమే పద్మా! నాకీ పెద్దమ్మ ఎవరో గుర్తురావటం లేదు. ఏదో సామెత చెప్పినట్టు అమ్మాలేదు; అమ్మకి బంధువులూ లేరు. ఇక ఎవరీ ఆండాళ్ళమ్మ?"

"అబ్బ! ఎందుకండీ అంత ఆలోచిస్తారూ? అంతా చదవరాదూ తెలుస్తుందేమో!" అంది పద్మ విసుగ్గా.

"పాయింటే!" అంటూ సారథి తిరిగి ఉత్తరం ప్రారంభించాడు.

"చిరంజీవి పార్థుణ్ణి....

ఆయు—వృద్ధిగా దీవించి— ఆండాళ్ళమ్మ .... ఏమనగా — నాయనా!, పార్థుడూ, నేను నీకు గుర్తున్నానో, లేదోగాని- నువ్వు నాకళ్ళలో మెదులుతూనే ఉన్నావు. మూడేళ్ళ క్రిందట నీ పెళ్ళికొచ్చాను. నీ మంచి చెడ్డలు చూస్తూ నీ దగ్గరగానే తిరిగాను. అప్పుడే నీ నెమ్మదీ, నీ గుణం అదీ చూచి ముచ్చటపడ్డాను. నాకీ పరిస్థితుల్లో నువ్వే గుర్తు వచ్చావు నాయనా! అయిన వాళ్ళందరికీ శత్రువునయ్యాను. గప్పున నువ్వు కళ్ళల్లో మెదిలేసరికి—"

"ఓహో! ఈ పెద్దమ్మా!" చటుక్కున ఏదో గుర్తు వచ్చినట్టు ఆగాడు. సారథి.

"గుర్తు వచ్చిందా? ఎవరావిడ?" అంది పద్మ కుతూహలంగా!

సారథి జవాబు చెప్పకుండా సీరియస్‌గా మిగిలిన ఉత్తరం చదవ సాగాడు.

"నువ్వు జ్ఞాపకం వచ్చేసరికి పుట్టెడు సంతోషం కలిగింది నాయనా! నీ దగ్గరకొచ్చేసి వుండాలని అనుకొంటున్నాను."

"ఏమిటీ? ఆవిడ మనింటికొచ్చేసి వుంటుందా?" పద్మ అడిగింది సంతోషంగా.

"అబ్బ నువ్వు అడ్డురాకు. నన్ను చదవనీ!" విసుగుదలా, ఆతృతా మిళాయించి ముందుకు సాగాడు సారథి.

"మేనల్లుడు గదా అని సూరిగాడి పంచకు చేరాను. ఎవడి పంచకు చేరితే మాత్రం నన్నేం పుత్తపుణ్యానికి పోషిస్తారేవిట్రా? బ్రతికినన్నాళ్ళూ తిన్నది తినగా, నన్ను తగలేసేటంత ఆస్తి వుంది. ఆ సంగతి మీ అందరికీ తెలిసిందేగా? కాశీలో కూర్చున్నా ఏడాది తిరిగొచ్చేసరికి కాళ్ళమీదకొచ్చి పడుతుంది రొక్కం. ఎవడి సంపాదనా నాకు రాగి దమ్మిడీ అక్కర్లేదు నాయనా! మొన్న సంక్రాంతికి వాడి చిన్న కూతురికి ముచ్చటపడి రెండు పేటల పలకసర్లు గొలుసు చేయించాను- దండిగా వుంటుందికదా అని పది కాసులు పెట్టి మరీ చేయించాను. వాడి సంసారానికైనా చెయ్యి వెత్తిగా వున్నప్పుడల్లా, పెద్దదాన్ని చూస్తూ ఎలా వూరుకుంటాను చెప్పు. కాస్తో, కూస్తో సర్దుతూనే వచ్చాను. ఇంతా జేస్తే వాడెంతటి విశ్వాసఘాతకుడయ్యా డురా నాయనా! పెళ్ళాం చెప్పుడు మాటలు విని నామీదకొచ్చి పెద్దా,చిన్నా చూడకుండా నానా కూతలూ కూశాడు మొగుణ్ణి నా మీదికి తోలి అది రాచ్చిప్పలా చోద్యం చూస్తూ నుంచుంది. చెప్పుకుంటే సిగ్గు. మేనల్లుడే! ఇంట్లోంచి పొమ్మన్నాడు పెద్దదానివేగాని బుద్ధిలేదన్నాడు. సంసారాలు పాడు చెయ్యడానికే తిరుగుతున్నావన్నాడు. ఎన్ని అన్నాడని నాయనా! కళ్ళనీళ్ళు కళ్ళ గుక్కుకొని లేచి చక్కా వచ్చాను. ఓ మంచి పనిమాత్రం చేశాననుకో! ఆ గొలుసూ, కాయితాలూ అవి ఏవీ వుంచకుండా చక్కా పట్టుకొచ్చాను. నేను పనికిరానివాళ్ళకి నా సొమ్ములెలా పనికివస్తాయిరా? ఇప్పుడు పూజారి నరసింహంగారి వసారాలో ఓ తవ్వెడు నూకలు పొంగిం చుకుని రెండు ముద్దలు తింటున్నాను. నీ జవాబు చూసుకుని నీ దగ్గరికి రావాలని పుట్టెడాశతో వున్నాను. కోడలుపిల్ల మంచిదని మనవాళ్ళంతా

అనుకుంటారు. ఆ ఏడుకొండలవాడిని స్మరించుకుంటూ ఇక మీ దగ్గరే పడి వుందామని వుంది, నాయనా! ఓ కార్డు ముక్క రాయి. వెంటనే బయల్దేరి వస్తాను. కోడలిని దీవిస్తున్నానని చెప్పు. మనమడికి ముద్దులు. ఉంటాను మరి.

ఇట్లు,

మీ పెద్దమ్మ, ఆండాళ్ళమ్మ"

"పాపం! ఎవరండీ ఆవిడ?" అంది పద్మ సానుభూతిగా!

"పాపం లేదు గీపం లేదు. మా ఇంటికి రావటానికి వీల్లేదని జవాబు రాసేస్తాను" అన్నాడు సారథి ఆవేశంగా.

పద్మ తెల్ల బోయింది- "ఎందుకలా కంగారుపడతారు? ఆవిడేం దెయ్యమా? భూతమా?"

"అంతకన్నా ఘోరం. నిజం పద్మా! నీకు తెలియదు కానీ, చాలా ప్రమాదకరమైన మనిషి. కావలసిన వాళ్ళంతా వదులుకుంటూంటే మన కెందుకీ తద్దినం?"

"అసలావిడ ఎటువంటి పెద్దమ్మ మీకు?"

"మా తాత పెళ్ళాం మొగుడి అల్లుడి మేనల్లుడి భర్తగారి అత్తగారి అప్పగారి-నా మొహం నా కొకటి తెలుసా అని, నీకు చెప్పడానికి? ఏదో చుట్టం వరసకి పెద్దమ్మ. అందరితోపాటు పెళ్ళి కొచ్చింది. అన్నీ తనే అన్నట్టు పూసుకు తిరిగింది. నన్ను దృష్టిలో పడేసుకుని ఇప్పుడు దాడి చేయబోతూంది."

పద్మ నవ్వింది- "అయితే దూరం అంటారేం? చాల దగ్గరే."

"హాస్యంకాదు పద్మా! ఆవిడ మొహమాట మేమిటి మనకి? సింగినాదం, రావటానికి వీల్లేదని రాసేస్తాను."

"ఏం, వచ్చి మన ఇంట్లోనే వుంటే మనకి పెద్ద దిక్కుగా ఉంటుంది కదూ?" అంది నెమ్మదిగా.

"ఆవిడ విషయం తెలియక అలా అంటున్నావు కాని, మంచిది కాదు పద్మా!"

"అంటే?" ఏమిటన్నట్టు సారథి మొహంలోకి చూసింది పద్మావతి.

"అంటేనా? అంటే....ఏమో మరి. ఆవిడ మంచిది కాదని బంధువు లంతా చెప్పుకుంటారు."

"మంచిది కాదంటే యేమిటని?" గట్టిగా అడిగింది, పద్మావతి.

సారధి జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి కాస్సేపు ఆలోచించి యేదో తోచినట్టు – "అంటేనా? చెప్పమంటావా? ఆవిడ అచ్చుసినిమాల్లో సూరేకాంతం. ఈ అండాళ్ళమ్మకీ ఆ సూరేకాంతానికీ తేడా లేదు. అదీ! తెలిసిందా?" అనేసి సరిగ్గా చెప్పగలిగాను కదా అన్నట్టు చూశాడు.

పద్మ క్షణం ఆగి- "పాపం ఆవిడ మీ కంత ఆప్యాయంగా, ఆశగా ఉత్తరం రాస్తే, ఎందుకలా ఆడిపోసుకుంటారు?" అంది జాలిగా. నిజంగా పద్మావతికి అండాళ్ళమ్మగారి మీద సానుభూతే కలిగింది.

"అయితే నువ్వనేదేమిటి?"

"ఆవిడ వస్తానంటోంది కదా? రానివ్వండి."

"పద్మా! నీ కేం మతిపోయిందా! ఆవిడ ఆస్తిపాస్తుల్ని కూడా లెక్క చెయ్యకుండా, ఆవిణ్ణి కావలసిన వాళ్ళంతా దూరం చేసుకుంటున్నారంటే కారణం యేమిటో ఆలోచించావా?"

"ఏది ఆలోచించడానికైనా ఆవిడ అసలు నాకేం తెలుసు? ఆవిడకు పిల్లలులేరా?" అడిగింది పద్మ.

"ఆవిడ విషయాలన్నీ నాకూ అంతగా తెలీవు. మనపెళ్ళి కొచ్చినప్పుడే ఆవిణ్ణి గురించి నలుగురూ అనుకోగా విన్నాను. బోలెడు ఆస్తీ పాస్తీ, లంకంత లోగిలీవున్న ఇల్లాలేనట. ఒక్కగానొక్క కొడుక్కి చిన్నతనంలోనే పెళ్ళిచేస్తే,భార్య పెద్దమనిషైనా కాక ముందే ఆ పిల్లవాడు కాస్తా ఏదో జబ్బుచేసి చచ్చిపోయాడట. కొడుకుమీద బెంగతోటీ, పెళ్ళాంతో సరిపడకా, ఆవిడ మొగుడు కాస్తా ఓనాటి రాత్రికి రాత్రే రహస్యంగా కాశీకి బయలుదేరి పోయాడట. అది ఎప్పుడో ముప్ఫయ్యేళ్ళనాటి మాట. ఇప్పుడాయన కాశీలోనైనా ఉన్నాడో-ఊడాడో యెవరికీ తెలీదు. ఈవిడ మాత్రం మొగుడిమీద కోపంతో గాజూ–పూసా తీసిపారేసింది. పాపం ఆ కోడలు మొగుడు లేకపోయినా, అత్తగారి దగ్గరకు వచ్చిందట. ఏదో ఆ పిల్లనైనా చూసుకుంటూ నిక్షేపంలా ఆ ఇంట్లో పడివుండకూడదూ? ఆ పిల్లనికూడా అతకనివ్వకుండా రోజూ 'అలాంటి ముండవి, ఇలాంటి ముండవి. నిన్ను కట్టుకోకపోయినా నా కొడుకు బ్రతికేవాడు. పాపిష్టిదానా! నువ్వే నా కడుపు కాల్చావు' అంటూ చంపుకు తింటూంటే, కొన్నాళ్ళికి కావలసిన వాళ్ళంతా కలుగజేసుకుని, ఉన్న ఆస్తి ఇద్దరికీ చెరిసగం పంచేసి యెవరి దారినవాళ్ళని

పొమ్మన్నారట. ఆ అమ్మాయి పుట్టింటికి వెళ్ళి పోయిందట. చెల్లెలి కొడుకుని కాబోలు, దత్తత తీసుకుందన్నారు. లక్షణంగానే బ్రతుకుతూంది. ఇక ఈవిడ సంగతి. ఒక నికరంలేదు. ఎక్కేగడపా, దిగేగడపా! నెలకో ఇంట్లో పాదంమోపుతుంది. వాళ్ళతో ఏదో గొడవ తెచ్చుకుంటుంది. మరో చోటికి బయలు దేరుతుంది. బిడ్డలు లేరనేగానీ, అంత కన్నా ఎక్కువగా చూసుకునే మేనకోడళ్ళూ, మేనల్లుళ్ళూ, అక్కబిడ్డలూ, చెల్లెలిబిడ్డలూ, చాలామంది బంధువులు ఉన్నారు. ఏంలాభం? ఎవర్నీ అతకనివ్వదు. ఎక్కడా మంచిగా ఉండదు. మతిపోయినట్టుతిరుగుతూ ఉంటుంది."

"పాపం! కష్టాలుపడి ఉండటంచేత, మతి చలించినట్టు ఉందేమో!" అంది పద్మ జాలిపడుతూ.

"నీ మొహం-ఆవిణ్ణి సమర్థిస్తున్న దానివి నువ్వొక్కదానివే కన పడ్డావు. ముందు డబ్బుకి కక్కుర్తిపడి చేరనిచ్చినా వెధవపోరు ఎన్నాళ్ళని సహిస్తారు? పొమ్మంటారు మరోచోటికి చేరుతుంది. మేనల్లుడి గురించి వ్రాసిందే ఉత్తరంలో, వాడు నాకు బాగా తెలుసు. చాలా మంచి వాడు. ఈవిడిలో యేలోటూ లేకపోతే సూర్యం ఎప్పుడూ దురుసుగా...."

"పెద్దావిడ ఏమైనా అంటే మాత్రం తప్పా? ఆ మాత్రం సహించ కూడదూ?"

పార్థసారథికి చిరాకు వేసింది- "అయితే నువ్వనేదేమిటి?"

పద్మ మాట్లాడలేదు. సారథి తమాయించుకున్నాడు. నెమ్మదిగా- "చెప్పు పద్మా! ఆవిణ్ణి రమ్మనటం నిజంగా నాకు ఇష్టంలేదు. నీ ఉద్దేశ్యం చెప్పు" అన్నాడు శాంతంగా.

"ఆవిణ్ణి గురించి మీరు చెప్పింది నూటికి నూరుపాళ్ళు నిజం కాదని పిస్తోంది నాకు వాళ్లూ వీళ్లూ చెప్పుకోగా విన్నదేగాని, ఆవిడగురించి మీకు స్వయంగ తెలీదుగా? లోకులు చెప్పుకోవడానికేం భాగ్యం? కాస్త వుంటే ఇంకాస్త కలుపుతారు."

"మరి ఆవిడకు కావలసినవాళ్ళు చాలా మంది వున్నారు కదూ? ఎక్కడో ఓ చోట నికరంగా ఎందుకుండదంటావ్?"

"బావుంది! ఆవిడకూ, వాళ్ళకూ ఏం గొడవ లున్నాయో! ఎవడికి తెలుస్తాయి?....అయినా చాలా మందికి పెద్దవాళ్ళుండటం గిట్టదు."

"ఓహో! నువ్వే చాలా మంచిదాన్నంటావు?"

"ముమ్మాటికీ! అత్తా, ఆడబిడ్డలూ వుండటం చాలా మంది అమ్మాయిలకు ఇష్టం వుండదు. కానీ వాళ్ళుండాలని నే నెంతో కోరుకున్నందుకే కాబోలు, నాకు ఎవరూ లేరు. 'అత్తయ్యా' అని పిలుస్తూ తిరగాలని నా కెంతో కోరికగా వుంటుంది."

"దానికేం? నిక్షేపంలా ఆ వంట చేసేటప్పుడూ, అప్పుడూ 'అత్తయ్యా!' అని నన్నే పిలుస్తూండు. లక్షణంగా పలుకుతూంటాను."

"సరేపోతారు. ఆర్డర్లు చేయటానికీ, అథార్టీలు చెయ్యడానికీ మీరే నలుగురత్తల పెట్టూ, ఆరుగు రాడబిడ్డల పెట్టూనూ."

"అందుకే నా మాటవిని, నాతో సంతృప్తిపడి వూరుకో."

"అదేం కుదరదు. ఆవిడ గత చరిత్ర మనకు అవసరంలేదు. ఆవిడ ఎలాంటిదైతేనేం? నేను మంచిగా వుండి ఏ గొడవా రాకుండా చూసుకుంటాను. ఆవిణ్ణి రమ్మనిరాద్దాం."

"ఎందుకు నీ కింత పట్టుదల?"

"ఇందులో పట్టుదలేముంది చెప్పండి? మనకు ఇంట్లో పెద్ద దిక్కెవరూ లేరు. మీరు వున్నంతసేపూ సర్దాగానే గడుస్తుంది. బాబుతో ఒక్కదాన్నే వుంటే, కాస్త పొద్దుపోయే వరకూ మీరు రాకపోతే ఏడుపొచ్చినంత పనవుతుంది. ఒక్కోసారి, ఆడవాళ్ళకి ఆడసాయం వుండటం ఎంత అవసరమో మీకేం తెలుసు? బాబు నెత్తుకొచ్చిన దగ్గిర్నుంచీ నాకు మరీ ఒక్కదాన్నీ వుండాలంటే భయంగా వుంటోంది. మొన్నరాత్రి చూశారా? కాస్త వాడి ఒళ్ళు వెచ్చబడేసరికి ఇద్దరం తెల్లవార్లూ హడలిపోతూ కూర్చున్నాం. అటువంటి సమయంలో పెద్దవాళ్ళెవరైనా ఉంటే యెంత ధైర్యంగా వుంటుందని! ఆవిడకై ఆవిడే వస్తానంది కదా?"

పద్మ మాటలు వింటూంటే సారథికి కూడా క్షణం నిజమేననిపించింది. మరుక్షణంలోనే ఆవిడంటే ఏదో జంకువంటి భావం పుట్టుకొచ్చింది. "నువ్వు దూరంగా ఆలోచించటం లేదేమో పద్మా! నిప్పులేనిదే పొగరాదట. ఆవిడ మంచిదైతే ఉత్తినే పుకార్లు పుట్టవు. అటువంటి మనిషిని పెట్టుకొని సుఖపడిపోతామను కోవటం కూడా భ్రమే."

పద్మ మాట్లాడలేదు. సారథి క్షణం ఆగి-"కొంపతీసి ఆవిడ డబ్బూ దస్కం ఇస్తుందని ఆశపడుతున్నావేం ఖర్మ?" అంటూ హాస్యమాడితే పద్మకు కోపం వచ్చింది- "ఛీ! నన్నింత తేలికగా భావిస్తారనుకోలేదు. మీ

ఇష్టం వచ్చినట్టు చేసుకోండి." అంటూ లేచి వెళ్ళిపోబోతున్న పద్మావతి కొంగుపట్టుకుని ఆపాడు సారథి. "అంతకోపం అయితే ఎలా అమ్మాయ్? ఇప్పుడు మునిగిపోయిందేమీ లేదుగా? నీ ఇష్టప్రకారమే కానీ! కాని నాకై నేనుమాత్రం ఆవిణ్ణి రమ్మని రాయను, రాయకపోయినా వచ్చి తీరుతుంది."

"అవును మరి మీరుద్ధరిస్తారని వచ్చి తీరుతుంది. తీరా వస్తే పొమ్మనండి. బావుంటుంది" అంది పద్మ విసుగ్గా.

"ఏ గొడవా రాకుండా పదిరోజులపాటు మనం ఎక్కడైనా పోయామంటే ఆవిడ వచ్చినా, వచ్చినదారినే వెంచేస్తుంది. కాని నీ కేమో ఆవిడమీద మహా మోజుగావుంది మరి. సరే! అదీ చూద్దాం! కాని అంత్యనిష్ఠూరంకన్నా, ఆది నిష్ఠూరం మంచిదోయ్ పద్మావతీ!"

"అయ్యో! మీకురాని సామెతలంటూ వున్నాయా?

"మరే! లేవు. అందుకే కాస్త ఆలోచించి చూడండి పద్మావతిగారూ!"

"మీ సలహా పాటించలేక పోతున్నాం పార్థసారధిగారూ!" అనేసింది పద్మ నిర్లక్ష్యంగా.

"ఓసీ! దుర్మార్గురాలా! భర్తను ధిక్కరిస్తావుటే!" అంటూ నిటారుగా కూర్చుని సారథి కోపం చేసుకొంటూంటే గుచ్చుకున్న పూలమాల జడలో పెట్టుకుంటూ నవ్వేసింది పద్మావతి.

*　　*　　*　　*

పార్థసారథి ఉత్తరానికైతే జవాబు రాయలేదుగానీ, ఏ దుర్ముహూర్తానో ఆండాళ్ళమ్మ పెద్దమ్మ సుడిగాలిలా చుట్టబెట్టుకు వచ్చేస్తుందని గడగడలాడుతూనే వున్నాడు. పద్మావతి మాత్రం ఆ శుభక్షణం ఎప్పుడొస్తుందా అని వేయి కళ్ళతో ఎదురు తెన్నులు చూస్తోంది.

ఆదివారంపూట భోజనాలైన తర్వాత బాబుని నిద్రపుచ్చి, తీరిగ్గా పక్క సర్దుకు పడుకున్నాడు సారథి పద్మ వంటగది సర్దుకు వచ్చి కుర్చీ మంచం దగ్గిరికి జరుపుకుకూర్చుంది. "పద్మా ఏదైనా చదువు! వింటూపడుకుంటాను." అన్నాడు సారథి. పద్మావతి క్రిందటిరోజే వచ్చిన కొత్తవీక్లీ తిరగవేస్తూ ఓ కథ ప్రారంభించింది. వదినా మరదళ్ళ సరసాలతో-అత్తాకోడళ్ళ హాస్యాలతో కథ మాంచి సర్దాగా సాగిపోతోంది. ఒక్కసారిగా పద్మావతి మనసు అత్తగారిమీదకి పోయింది. చటుక్కున పుస్తకం మూసి పారేసి- "ఉత్తరం రాయకపోయినా ఆవిడ వచ్చేస్తుందన్నారే?" అంది. 'అర్థం

చెప్పారేం?' అన్నట్టు.

"ఎవరావిడ? మండోదరా?"

"హాస్యాలకేంగాని, ఆండాళ్ళమ్మగారు రాలేదేం?"

"మన పాపం ఇంకా పండివుండదు." అంటూ తలగడలో మొహం పెట్టుకున్నాడు సారథి. పద్మకు కోపం వచ్చింది, కానీ తమాయించుకొంది. నిద్రపట్టక అటూ ఇటూ దొర్లుతూన్న సారథికి అనునయంగా చెప్పటం ప్రారంభించింది-"పాపం ఆవిణ్ణి ఎవ్వరూ గిట్టనివ్వకగానీ, లేకపోతే మనం తపస్సుచేస్తే మాత్రం మన ఇంటికి వస్తుందేమిటి? పెద్దవాళ్ళంటూ వుంటే కష్టానికీ, సుఖానికీ ఎంత సాయం! చాదస్తంగా వాళ్ళేదో అంటే అంటారు. మన మంచికే చెబుతారు. ఆ మాత్రం మందలించే వాళ్ళు మాత్రం వుండద్దూ? అంత మాత్రానికే...."

"ఓ పద్మావతీ! నీ ఉపన్యాసం కాస్త ఆపుచేస్తావూ!" అన్నాడు సారథి దిండులోంచి మొహం పైకెత్తి.

"ఓ! అలానే ఆపుచేస్తాను పూర్తికాగానే- అత్తయ్యా! అత్తయ్యా! అంటూ తిరగటం, అత్తగారి దగ్గిర ఒద్దికతో పనిపాటలు చేసుకోవటం ఎంత చక్కగా వుంటుందో?"

"నా మొహంలా వుంటుంది."

"మీ మొహానికేం? చంద్రబింబంలా ఎంచక్కా ముద్దొస్తూ వుంటేనూ! అత్తగారితో కాపరంకూడా ఇంత చక్కగానూ వుంటుం దంటారా?"

"నాకు నిద్రవస్తోంది పద్మా! ఈ ఆదివారంపూటైనా...."

"అవును పాపం! ఈ ఆదివారం-పూటైనా నిద్రా దేవత సెలవు తీసుకోకపోవటం ఏమీ బాగులేదు. కష్టమే!" అంటూ పద్మావతి గాఢంగా నిట్టూర్చింది.

"గడుసు కబుర్లు చెప్తున్నావే!" సారథి లేచి పద్మనందుకోబోయేసరికి వీధిలో రిక్షా ఆగిన చప్పుడూ, దాని వెనకే వీధి తలుపులమీద చిన్న సైజు పిడుగులూ!

"ఒరేయ్! అబ్బాయ్! పార్థసారథీ! పార్థుడూ! ఒరేయ్!"

"అదిగో పెద్దమ్మ-ఆండాళ్ళమ్మ-వచ్చేసింది! వచ్చేసింది!" అంటూ దిగ్గునలేచి కూర్చున్నాడు సారథి. పద్మ మెరుపులా వీధిగుమ్మంకేసి పరుగు

పెట్టింది. తలుపు తీసింది.

పద్మావతి ఎట్టెదుట ఆండాళ్ళమ్మ! తెల్లటి పంచెలో పొట్టిగా, పచ్చగా గుమ్మటంలాంటి ఆండాళ్ళమ్మ! తలుపులు తీసీ తియ్యగానే పద్మావతి కళ్ళల్లోకి సూటిగా చూసేస్తూన్న ఆండాళ్ళమ్మ! అట్టి ఆండాళ్ళమ్మగారి చుట్టూ ఓ నల్లి సంచీ- ఓ తెల్లసంచీ- ఓ గుడ్డల మూటా- మరచెంబూ— మేదరబుట్టా వగైరా సామాను సమేతంగా వచ్చేసింది ఆండాళ్ళమ్మగారు. పద్మావతికి పుట్టెడు సంతోషం కలిగింది. జగజ్జనని దర్శనమిచ్చినా పద్మావతికి అంత సంతోషం కలగదేమో!— "రండి; అత్తయ్యగారూ! రండి. ఆఁ ఉండండి కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళు తెస్తాను." అంటూ ఒక్కసారి అదృశ్యమై చల్లటి నీళ్ళతో నిండిన నిలువు చెంబు దక్షిణ హస్తంలో ధరించి ప్రత్యక్షమైంది.

"పార్థుడు లేడేపిల్లా? ఉత్తరానికి జవాబైనా రాశాడుకాదు. నా ఉత్తరం మీ కందలా?" ముందీ సంగతి తేల్చుకుంటా నన్నట్టు నిలదీసి అడిగింది ఆండాళ్ళమ్మగారు

అప్పుడే గదిలోంచి వస్తూన్న పార్థసారధి 'నీ ఉత్తరమేమిటో నువ్వేమిటో ఎరగం పొమ్మందా' మనుకున్నాడుగానీ, అంతలోనే పద్మావతి—

"అందింది అత్తయ్యగారూ! జవాబు కూడా రాస్తానన్నారే!" అనేసిందనీ వూరుకున్నాడు.

"ఏం జవాబు రాశాడూ? నా కందందే!" అంది ఆండాళ్ళమ్మగారు.

"అయ్యో! పెద్దమ్మా! నా జవాబు నీకు అందనే లేదూ?" అంటూ రంగంలో ప్రవేశించాడు సారధి అమాయకంగా.

"నీ వుత్తరం చదవగానే నా కడుపు చెరువైపోయింది పెద్దమ్మా! నువ్వు కార్డుముక్క రాయమన్నావుగానీ, నా మనసు ఒప్పక తక్షణం బయలుదేరి రమ్మని పెద్ద కవరు రాశాను పెద్దమ్మా!"

పద్మ కొంగు నోటికి అడ్డుపెట్టుకొంది.

సారధి మళ్ళా అన్నాడు—"నిజం చెప్పొద్దూ? నిన్ను తీసుకురావటానికి మొదట పద్మ ఒప్పుకోలేదుగానీ, నేను నచ్చజెప్పే సరికి పాపం పూరుకొంది—" పద్మావతి చురచురా చూస్తూన్నా, లక్ష్యపెట్టలేదు సారధి. ఆదిలోనే అత్తాకోడళ్ళకి మనస్పర్థలు కలిగించాలని పార్థుడి తాపత్రయం.

"ఇంతకీ నా ఉత్తరం నీ కందలేదన్నమాట! రేపో, మాపో నిన్ను

తీసుకురావటానికి నేనే వద్దామనుకుంటున్నానుకూడా. లేకపోతే నిన్ను కష్టాల్లో వదిలేసి ఎలా వూరుకుంటాను పెద్దమ్మా ?"

"మా నాయనే! అందుకే కాదుట్రా నీ ఇంటి కొచ్చానూ. అవుతే జవాబు రాశావన్నమాట. అయ్యో! ఎక్కడ అందనిస్తార్రా? ఆ సుఁరిగాడు నా మీద కత్తి కట్టాడుకాదూ? ఆ వుత్తరాలవాణ్ణి అటకాయించి, ఆ వుత్తరం కాస్తా వుళ్ళాక్కుని చించి పోగులు పెట్టివుంటాడు, దొంగవెధవ."

"పోనీ పెద్దమ్మా! నువ్వు వచ్చేశావు. అంతేచాలు. ఆరోగ్యం అదీ బాగుంటోందా ?" పైకి క్షేమం అడుగుతూనే– 'నీ ఆరోగ్యానికేం పోటీ వుండదులే' అనుకున్నాడు సారథి మనసులో.

"ఏం ఆరోగ్యం లేరా అబ్బాయ్! పట్టుమని పదిముద్దలు తినలేను గదా? అరిగి చావదు" అంటూ వాపోయింది ఆండాళ్ళమ్మగారు.

"అయ్యో, పాపం!" అనుకొంది పద్మావతి.

"హమ్మో! నీ పట్టుతో పదిముద్దలే!" హడలిపోయాడు పార్థసారథి.

వీధిలోంచి రిక్షావాడు కేకలెడుతున్నాడు—"బామ్మగారూ! ఎండలో నిలబడి పోయాను. డబ్బు లిప్పించండమ్మా! పోతాను" అంటూ.

"ఓరి నీ మొహం మండా! ఇంకా వెళ్ళలేదట్రా ? చూడవే అమ్మాయ్! ఆ తెల్లసంచీలో చిల్లరుంది, ఓ పావలాబిళ్ళ వాడి మొహాన...."

"ఇప్పుడు సంచీ తియ్యటం ఎందుకులెండి అత్తయ్యా! డబ్బులు నా దగ్గిరున్నాయి, ఇస్తాను" అంటూ పద్మావతి వంటగదిలోకెళ్ళి పోపుల పెట్టెలో భద్రం చేసుకుంటూన్న స్వంత ధనంలోంచి ఓ పావలాబిళ్ళ తెచ్చి అత్తగారు చెప్పినట్టు అక్షరాలా రిక్షావాడి మొహాన్న విసిరింది.

"స్టేషన్ నుంచి ఈ వీధికి బేడేకాదుటోయ్" అన్నాడు సారథి.

"బేడే అనుకోండి బాబూ ఒక శాల్తీకి"

"మరి ఇద్దర్ని తీసుకొచ్చావా ఏమిటి?"

"ఇద్దరు కాదనుకోండి బాబూ...." రిక్షావాడు నసుగుతూ నిలబడితే సారథి నవ్వు ఆపుకొని– "సరేలే! వెళ్ళు! వెళ్ళు!" అంటూ వాణ్ణి పంపేశాడు. అంతా గ్రహించుకొని ఆండాళ్ళమ్మగారు- "పోనీలే! వెధవ! మోసుకొచ్చాడు" అంటూ జాలిపడింది.

"ముందు కాళ్ళు కడుక్కోండి అత్తయ్యా!" అంది సవినయంగా కోడలు పద్మావతి, అత్తగార్ని మర్యాదచేస్తూ.

"కడుక్కుంటానే తల్లీ ! కడుక్కుంటాను. అనక ఆ పావలాబిళ్ళ తీసేసుకో సుమా!—....నా కేమిటో మీ ఇద్దర్నీ చూస్తుంటే ఆనందం పొంగు కొస్తోందర్రా" అంది ఆండాళ్ళమ్మగారు, మహదానందపడిపోతూ.

"మా పాపం పడిపోయింది. నీకు ఆనందం పొంగుకురాదూ మరి?" అనుకున్నాడు సారథి మంటగా. అత్తగారి ఆనందం కళ్ళారా చూసిన కోడలు పిల్ల సిగ్గుపడుతూ మురిసిపోయింది. ఆండాళ్ళమ్మగారు లేచి వెళ్ళి నిలువు చెంబెడునీళ్ళు వీధి చీడీలమీద బొడాబొడా ఒంపేసుకొని లోపలికొస్తూ— "పాడుఎండ ! ఏం కాస్తోందీ ! ఏం కాస్తోందీ! కాస్త దాహం నీళ్ళు ఉంటే మాడు తల్లీ ! గొంతు ఆర్చుకుపోతోంది" అంది.

'ఫర్వాలేదులే. గుండె ఆగిపోదు' అనుకొని — "కుర్చీలో కూర్చో పెద్దమ్మా!" అంటూ మర్యాదచేశాడు సారథి.

"ఆ, నాకు కుర్చీలెందుకు లేరా !" అంటూనే కుర్చీలో జేరబడీ – "ఈ కుర్చీలూ అవీ నీ పెళ్ళాం తెచ్చిందేమిట్రా ? మీ అత్తారు వున్నవాళ్ళే నేమిటి?" అంది గొంతు తగ్గించి.

"మొదలు పెట్టావూ?" అనుకొని—"ఆ(ఏదోలే, మనవంటి వాళ్ళే" అన్నాడు.

"బావుందిరా నాయనా ! బావుంది. అదృష్టవంతుడివి. లక్షణంగా పెళ్ళాం, కొడుకూ. ఆ( అన్నట్టు పిల్లాడేడీ !"

"నిద్రపోతున్నా డత్తయ్యా !" అంటూ అర్ధగజం మజ్జిగగ్లాసు అందించింది పద్మావతి.

దాహం అందుకొంటూ—"ఫర్వాలేదు. లేపి తీసుకరావే తల్లీ ! వాణ్ణి చూడకపోతే నా ప్రాణం ఆగదు" అంది ఆండాళ్ళమ్మగారు మరి ఆగలేనట్టు.

'నిజంగా వాణ్ణి చూడకపోతే ఈవిడ ప్రాణం పోతుందీ ? వాణ్ణి చస్తే చూపించను' దృఢనిశ్చయం చేసుకొన్నాడు పార్థసారథి. కాని పద్మావతి భర్తగారి దృఢనిశ్చయాన్ని సడలించేస్తూ లోపలిగదిలోకెళ్ళి నిద్రపోతున్న కొడుకును తీసుకొచ్చి అత్తగారికి అందించి మరీ వూరుకుంది.

"అమ్మ ! అమ్మ ! ఎంత ముద్దుగా వున్నాడే! పాలు సరిపోతున్నా యేమిటే? పొత్రంలా వున్నాడు" అత్తగారు అంటూంటే పద్మావతికి చీమ కుట్టినట్టుమాత్రం అయింది. చీమే కదా అని దులిపేసుకొంది.

'పసివెధవ మీదే పడ్డాయా నీకళ్ళు? నువ్వు లేపూ డోలులాగా !' అనుకుని మండి పడ్డాడు సారథి.

ఆండాళ్ళమ్మగారు నిద్రపోతున్న పిల్లవాణ్ణి కుదిపేస్తూ "ఇంకా నిద్రేమిట్రా? బామ్మని వచ్చాను, చూడరాబాబూ ! నీకో మంచి బహుమతి తెచ్చానురోయ్ ! ఏదే అమ్మాయ్ ! ఆ నల్లసంచీ ఇలా పట్రా !" అంటూ పురమా యించింది. పద్మావతి అర్థంగాకపోయినా ఫలానా నల్లసంచీ తెచ్చి అత్తగారికిచ్చి, చూస్తూ నిలబడింది.

ఆండాళ్ళమ్మగారు సంచిలో పైన పెట్టిన నీరుకావి పంచెలన్నీ తప్పించి పాతాళంలోంచి ఓ బొట్టుపెట్టెవంటి పెట్టె పైకి తీసింది. తాళ్ళు విప్పి, పెట్టె తెరిస్తే అందులో ఓ గుడ్డమూట ! గుడ్డమూటలో దంతం భరిణి! దంతం భరణిలో కాయితం పొట్లాం! కాయితం పొట్లాంలో....

'ఈవిడ ప్రాణాలుగాని లేవుకదా !' ఊపిరి బిగబట్టి కళ్ళు చిట్లించి చూస్తూ మునివేళ్ళమీద నిలబడ్డాడు సారథి. "ఏమిటో?" సస్పెన్సు భరించ లేకపోతోంది పద్మావతి.

ఆ తెల్లని కాయితం పొట్లంలో మరో ఎర్రటి ఉల్లిపొర కాయితం ! అందులోంచి రెండు పేటల పలకసర్లు గొలుసు తీసి విజయగర్వంతో ఆ దంపతులిద్దరికేసి చూసింది ఆండాళమ్మగారు.

గంటనుంచీ బిగపట్టిన ఊపిరంతా గుప్పుమని వదిలేశాడు సారథి. కళ్ళు చిట్లించుకొని మరీ గొలుసు చూసింది పద్మావతి.

ఆండాళ్ళమ్మగారు గొలుసు బాబిగాడి మెడలో వేస్తూ— "ఇది నువ్వే ఉంచుకోరా నాన్నా ! అమ్మకు కూడా ఇవ్వకూ ?" అంటూ పిల్లాణ్ణి ముద్దుపెట్టుకొంది.

"ఇదేనా నువ్వు సూర్యం కూతురికి చేయించిందీ ? పోనీ దానికే ఉంచెయ్యక పోయావా ?" అన్నాడు సారథి.

"అదేం మాటరా ? నేను పనికిరాని వాళ్ళకి నా సొమ్ములెలా పనికి వస్తాయంటావ్ ? ఇదీ ఉంచేసుకోవాలని మహా తాపత్రయపడ్డారే ! నేనా పూరుకునేది ?"

"పద్మా ! బాబు నిద్రపోతున్నాడు. తీసికెళ్ళి పడుకోబెట్టు" అంటూ ఆండాళ్ళమ్మగారి ధోరణికి బ్రేకు వేశాడు సారథి.

పద్మ పిల్లవాణ్ణి తీసికెళ్తూంటే—"అమ్మాయ్! గొలుసు భద్రం,

జాగ్రత్త" అంటూ హెచ్చరించింది ఆండాళ్ళమ్మగారు.

పద్మావతి బాబుని పడుకోబెట్టి వంటగదిలో దూరి, వేళగాక పోయినా ముగ్గురికీ కాఫీ చేసుకొచ్చింది.

"అమ్మాయ్, మీరు ఫలహారం చేసుకోరే?" అడిగింది ఆండాళ్ళమ్మ గారు కాఫీగ్లాసు అందుకొంటూ.

"లేదత్తయ్యా! పిల్లవాడితో నా కొక్కదానికి తీరదు. ఏదైనా సెలవు నాడు చేస్తుంటాను-" అంది పద్మావతి.

"అవును పెద్దమ్మా! నీ కోడలు టిఫెన్లు గొప్పగా చేస్తుంది.తయారు చేశాకే పేరు పెడుతుంది" అన్నాడు సారథి నవ్వుతూ.

ఆండాళమ్మగారు గూడా పకపకలాడుతూ నవ్వేసింది-"రేపట్నుంచీ వంటా అదీ నేను చూస్తుంటాలేవే అమ్మాయ్! నీ కొడుకునీ, మొగుణ్ణీ చూసుకో" అంది కోడలు పిల్లతో. అత్తగారూ, భర్తగారూ కలిసి తనకసలు వంటే రాదని నిర్ధారణ చేస్తున్నందుకు పద్మావతికి కాస్త చిన్నతనమని పించింది.

"అవును మరి, పెద్దవాళ్ళు చేసినట్టు చెయ్యలేను గదా?" అని తనకు తానే నచ్చజెప్పుకుంది. "ఈ సంచులవీ లోపల దాచమంటారా అత్తయ్యా?" అంది ధోరణి మారుస్తూ.

"ఆఁ ఆఁ, ఉండు. పార్థుడికి కొన్ని కాయితాలు చూపించాలి" అంటూ గ్లాసు ఖాళీచేసి లేచివెళ్ళి తెల్ల సంచిలోంచి మోపెడు కాయితాలు తీసి ఆ కట్టంతా పార్థుడి ముందు పడేసింది ఆండాళ్ళమ్మగారు.

"ఆఫీసు ఫైళ్ళేమైనా ఈవిడ సంచీలో పుట్టాయేమిటి?"అనుకొంటూ, "ఏమిటివన్నీ పెద్దమ్మా?" అన్నాడు సారథి.

"చూడరా తెలుస్తుంది. నేను మాత్రం ఏం జేసుకుంటాను గనుకా? నువ్వే దాచుకో" అంది ఆవిడ తాయిలం ఇస్తున్నట్టు.

పద్మావతి కళ్ళు ఇంతింత చేసుకొని బుగ్గన వేలు వేసుకొని కూర్చుంది.

పార్థసారథి కట్ట విప్పి ఒక్కో కాయితం చూడనారంభించాడు- "ఫలానా ఊళ్ళో ఫలానా వారికి అప్పులిచ్చిన నోట్లు కొన్ని- చేబదుళ్ళిచ్చి సంతకాలు చేయించుకొన్న కాయితాలు కొన్ని-ఇళ్ళూ వాకిళ్ళూ తనఖా పెట్టి వ్రాయించుకున్న దస్తావేజులు కొన్ని- బకాయిపడిన మగతా తాలూకు

రైతులు రాసిచ్చిన పత్రాలు కొన్నీ- చావబోయే నోటుకి కొంత తీర్పు పెట్టి తిరగ రాయించుకున్న బాపతు కొన్నీ- చెంబూ, గాజూ వూసా తాకట్టు పెట్టి- వడ్డీ వివరాలతో రాసిన చీటీలు కొన్నీ- ఎక్కడెక్కడి పొలాలకి ఎంతెంత ధాన్యం రావాలో వివరించే కౌళ్ళ పత్రాలు కొన్నీ- అన్నీ తడిసి మోపెడు కాయితాలైతే ఉన్నాయి. అవి వసూలు అయ్యేదెప్పుడో మరి! "హమ్మా! అండాళ్ళమ్మా! ఎన్ని వ్యాపారాలు చేస్తున్నావూ?" అనుకుని విస్తుపోయాడు సారధి.

"అన్నీ చూశావూ?" అంది అండాళ్ళమ్మగారు.

"చూశానుగాని పెద్దమ్మా! మనలో మనమాట, ఇవన్నీ వసూలయ్యే నంటావా!" సారధికి ఓ ధర్మసందేహం.

"ఏమిటీ?" ఉరిమి చూసింది అండాళ్ళమ్మగారు. సారధి బిత్తర పోయాడు.

"వసూలు గాకపోతే వూరుకుంటానూ? చచ్చి దెయ్యాన్నై పట్టు కుంటాన్రోయ్" అంటూ పకపకలాడింది అండాళ్ళమ్మగారు.

'అఘోరిస్తావ్' అనుకున్నాడు సారధి తేరుకుని.

"అన్నీ జాగ్రత్తగా దాచుకో. నువ్వే వసూలు చేసుకొంటువుగాని" అంది ఆవిడ ధారాళంగా.

"అదేమిటి పెద్దమ్మ! దాచమంటే దాస్తానుగానీ నీ డబ్బు నా కెందుకూ? నీ వాళ్ళే బోలెడుమంది వున్నారు."

"అదేంమాట? ఇప్పుడన్నావ్‌గానీ ఇంకెప్పుడూ అనకు. నేను పనికి రానివాళ్ళకి నా సొమ్ము ఎలా పనికివస్తుందిరా? నా ఆస్తిపాస్తుల్ని నా ఇష్టం వచ్చినవాడికి ధారపోసుకుంటాను. ఎవడు కాదంటాడో చూస్తాను. అన్నీ నువ్వే వసూలు చేసుకో! ఇదిగో, ఇలా చూడూ! మావూళ్ళో కోవెల చెరువు పక్క రెండెకరాలూ నీకే రాసేస్తాను. ఆఁ అంతే" అంది అండాళ్ళమ్మ గారు ఆవేశంగా.

పద్మావతికి కళ్ళముందు జిగేల్‌మని మెరుపు మెరిసి చిమ్మచీకట్లు కమ్మాయి. పెద్దమ్మ మాటలు వింటూ సారధి తెల్లబోయాడు.

"నా పేర పొలం రాస్తావా?"

"ఏం తీసుకోవా?" అంది ఆవిడ భీకరంగా.

"అదికాదు పెద్దమ్మా! ఆ పొలం నువ్వు క్రిందటి సంవత్సరం సరోజకు పెళ్ళిలో చదివించావు కదూ?"

"ఆఁ, సింగినాదం. చదివించాను. చదివింపేగా! అప్పుడు నిజంగా యిచ్చేద్దామనే చదివించాను. అదిమాత్రం నన్ను చేరనిచ్చిందా? మొన్న శ్రావణంలో అది అత్తారింటికెళ్తూంటే 'నేనూ వచ్చి నీ దగ్గర వో పది రోజులుంటానే అమ్మడూ!' అన్నాను. 'ఎప్పుడో తీసికెళతాలే. ఇప్పుడు కాదు. మా అత్తగారూ వాళ్ళూ ఏమనుకుంటారో!' అంది నసుగుతూ. చెప్పొద్దూ! నాకు కోపం వచ్చింది. నేను రెండెకరాలిస్తున్నాను కదా? దాని అత్తగారి పెత్తనమేమిటీ అంట? ఆ సరోజకే ఇష్టంలేదురా, నన్ను తీసి కెళ్ళటానికి. 'నీ పని ఇలావుందా?' అనుకున్నాను. ఈ ఏడాది పంట నేనే ఉంచేసుకున్నాను. నేను పనికిరానివాళ్ళకి నా సొమ్ము ఎలా పనికివస్తుందిరా? ఇక ఆ పొలం దానికి ఇవ్వను. నీకే" అనేసి ఊరుకుంది ఆవిడ.

పద్మావతికి కూడా అదేమంత సమంజసం అనిపించలేదు.

"ఐనా పెళ్ళి పందిట్లో పదిమంది వినగా చదివించావు. ఇప్పుడు మానేస్తే బావుండదులే పెద్దమ్మా! నేను తీసుకున్నా నలుగురూ నన్నంటారు" అన్నాడు సారథి సావధానంగా. ఆండాళ్ళమ్మగారు భయ్యిమంది- "ఎవడ్రా నిన్ననేది? నా దగ్గిరికి రమ్మనూ! డొక్కచించి డోలుకట్టి వాడి చెవిదగ్గరే వాయిస్తాను. పళ్ళు పీకేస్తాను వెధవకి. ఏమైనాసరే ఆ పొలం నీకే ఇస్తాను. ఎవడంటాడో చూస్తాను!"

"సరేలే పెద్దమ్మా! ఎండలో పడివచ్చావు. కాస్సేపు పడుకో. ఇప్పుడెందుకీ గొడవలన్నీ?" అంటూ పెచ్చు పెరిగిపోతూన్న ఆండాళ్ళమ్మ గారి ఆవేశానికి అడ్డువేశాడు సారథి.

"మరే నాయనా, చల్లనిమాట చెప్పావు. అలాగే పడుకుంటాను. తాయితాలవీ భద్రం సుమా! అమ్మాయ్! పిల్లాడి గొలుసుకూడా భద్రంగా దాచుకో! పని మనుషుల్ని గట్రా నమ్మకూడదు దొంగ వెధవలు. ఏదీ, ఓ చాప ఇలా పడెయ్- నడుం వాలుస్తాను."

"కింద ఎందుకత్తయ్యా, గదిలో మంచం వేస్తాను. రండి" పద్మావతి లేచివెళ్ళి అత్తగారికి మెత్తటి పక్క తయారుచేసింది!

మంచంమీద ఒరిగి అటూ ఇటూ దొర్లుతూ నిద్రలో మునిగి పోయింది ఆండాళ్ళమ్మగారు. సారథి తేలికగా ఊపిరి వదిలాడు. పద్మావతి

నెమ్మదిగావచ్చి సారధి పక్కన కూర్చుంది.

"ఎలావుంది?" అన్నాడు.

"ఏమిటి?"

"అదే, నాకు పెద్దమ్మా- నీకు అత్తయ్యా, ఆండాళ్ళమ్మా!"

"అమాయకురాలు."

"అలాగా?"

"కాకపోతే మీకు రెండెకరాలు రాస్తానంటుందేమిటి?"

"ఆవిడ అంటేమాత్రం మనకు బుద్ధిలేదూ?"

"బావుంది. ఆవిడకై ఆవిడే ఇస్తానంటే...."

సారధి బ్రహ్మాండంగా నవ్వాడు- "అహో, పద్మావతీ! ఆడదాన్ననిపించుకున్నావ్ సుమా?"

పద్మావతికి పౌరుషం వచ్చింది- "ఆడపుటక పుట్టి ఆడదాన్ననిపించుకోకేం?" అంది విసురుగా.

"అమ్మాయ్. నీకింత విసుగెందుకుగానీ నెమ్మదిగా ఆవిణ్ణి మంచి చేసుకో. ఆవిడకి బోలెడు నగా నట్రా ఉన్నాయట. అన్నీ నీకే ఇస్తుంది! ఎంతలేదన్నా ఓ చిన్న మువ్వల వడ్డాణమైనా చేయిస్తుంది. నువ్వెప్పుడన్నా కోప్పడితే తిరిగి తీసేసుకుంటుందనుకో!" అన్నాడు నవ్వుతూ సారధి.

"నాకేం అక్కర్లేదు. నేనంత ఆశగొట్టుదాన్నేం కాదు." అంటూ రుసరుసలాడుతూ వెళ్ళిపోయింది పద్మావతి

* * * *

ఆండాళ్ళమ్మగారు వచ్చి వారంరోజులైంది. ఆ వారం రోజులూ ప్రశాంతంగానే గడిచాయి.

"తుఫాను వచ్చే ముందు వాతావరణం ప్రశాంతంగా వుంటుందంటారు. ఇది అటువంటి ప్రశాంతత కాదుగదా కొంపదీసి! స్వంత కొంప కూడా కాదు. అద్దెకొంప," అనుకొన్నాడు పార్థసారధి.

పద్మావతి బద్ధకించి పొద్దున్నే లేవలేకపోయినా ఆండాళ్ళమ్మగారే లేచి పనుల్లో జొరబడటం, పొయ్యిదగ్గర వంటగదిలో పని అంతా కోడలిపిల్ల సాయమైనా లేకుండా అత్తగారే చేసుకుపోవడం, రెండుపూటలా టిఫెన్లు (చేస్తూ చేస్తూ సగానికిపైగా రుచి చూసినా) లక్షణంగా చెయ్యటం-

చంటివాణ్ణి చంకవేసుకొని వాడి చేతుల్లో అరడజను బిస్కట్లు పెట్టించుకొని సాయంత్రాలపుడు పొరిగిళ్ళకు తిప్పుకురావటం, పార్థుడు ఇంట్లోలేని ఖాళీ సమయాలన్నీ అత్తా కోడళ్ళిద్దరూ కష్టం సుఖం- మంచీ చెడ్డా- పిచ్చాపాటీ చెప్పుకుంటూ సద్వినియోగ పర్చటం, మధ్యాహ్నంపూట కోడలికి నీతులు బోధిస్తూ (మొగుణ్ని ఎలా లెక్కచెయ్యకుండా తిరిగి లొంగదీసుకోవాలో, జీతం డబ్బులు రాగానే తీసేసుకుని ఎలా దాచిపెట్టాలో గట్రా) నున్నగా తలదువ్వి గట్టిగా జడవెయ్యటం (ఆ జడ పద్మావతికి ఎలా నచ్చుతుంది? అని అడగకండి. నచ్చుతుంది. అంతే), 'నీ మంచికే చెప్పుతున్నానే తల్లీ!' అంటూ అత్తగారు అడపా దడపా మందలిస్తూన్నా కోడలుపిల్ల మౌనంగా చిరునవ్వు మాత్రం నవ్వి ఊరుకోవటం (అత్తగారిని గౌరవిస్తున్నాను కదా అనుకొంటూ)- ఇత్యాదులన్నీ ఆ ప్రశాంతతలోకే వస్తాయి- "ఎంచక్కా హాయిగా ఉంది" అనుకొంది పద్మావతి. "ఈవిణ్ణి చేరదియ్యటం ఏ విధంగా చూసినా మంచికే సుమా!" అనికూడా అనుకొంది.

ఆ రోజు ఆఫీసునుంచి వచ్చిన పార్థసారధి, భార్యామణి కొంగుపట్టుకుని ఏదో కబుర్లు చెప్తూన్నవాడల్లా ఆండాళ్ళమ్మగారి రాక ఆకళింపు చేసుకొని కొంగు వదిలేశాడు.

"అమ్మాయ్, పద్మావతీ! బాబిగాణ్ణి తీసుకుని నేనలా శేషమ్మొదిన గారింటికి వెళ్ళొస్తాను. ఇల్లు భద్రం" అంటూ ఓసారి గదిలోకి తొంగిచూసి వీధిలోకి వెళ్ళిపోయింది ఆండాళ్ళమ్మగారు.

సారధి బట్టలు మార్చుకుంటూంటే పద్మావతి ఫలహారం అమర్చింది. "ఈ వారం రోజులకే నాకు చాలా కష్టంగా వుంది పద్మా!" అంటూ దగ్గరికొచ్చాడు సారధి.

"ఎందుకు?" అంది పద్మ అర్థంగాక.

"ఎందుకేమిటి? ఏమిటీ ఖర్మ చెప్పు. ఈవిడ రాకముందు ఎంత స్వేచ్ఛగా వుండేవాళ్ళం. ఎవరో వస్తారనీ, ఎవరో చూస్తారని, జంకూ గొంకూ లేకుండా- ఆడింది ఆటగా, పాడింది పాటగా! ఛ! ఆ సరదా ఎక్కడ? నువ్వసలే మైలపడ్డట్టు దూరదూరంగా తిరగటం ప్రారంభించావు."

"బావుంది. లేకపోతే ఆవిడ వుండగానే వచ్చి మీ ఒళ్ళో కూర్చోమంటారేమిటి?"

"అందుకే కదూ, నేను అఘోరించేది? ఏమిటీ ఖర్మ?"

"మీ శృంగారం సాగటం లేదనేగా ఈ వేదాంతం? ఆవిడవల్ల ఎంత సుఖంగా వుందో తెలుసా?"

"నా మొహంలా వుంది. నీకు సుఖంగా వుందేమో; నాకేం లేదు. వెధవ తద్దినం తెచ్చిపెట్టావు!"

"మీ అమ్మగారే వుంటే ఏం చేసేవారేమిటి?"

"నిన్ను నాలుగు తన్నేవాణ్ణి! వెధవ తల తిరుగుడు లేకుండా!"

సారథి చిరాకు చూసి పద్మ నవ్వింది. "ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు?"

"ఆవిడతో జగడం వేసుకోరాదూ? పోతుంది?"

పద్మ విరగబడి నవ్వింది. నవ్వుతూన్న పద్మ కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు సారథి- "నిజం చెప్పు పద్మా! ఎప్పుడూ లేనిది దూరదూరంగా తిరుగుతోంటే నీకు బాధగా లేదూ?"

పద్మ కళ్ళు దించుకుంది "ఎందుకు లేదూ? ఎలానో సరిపెట్టుకోవాలి. మనం అదే ఆటలు నలుగురూ వున్న కుటుంబాల్లో ఎక్కడా సాగవు."

"సాగేవాటినికూడా ఆపుజేశావు. పైగా నీతులు నేర్పుతున్నావు. ఛ! నాకు ఇంటికి రావడం అంటేనే పూర్వంలా సరదా లేదు."

పద్మ క్షణం మౌనం వహించి "ఎందుకలా బెంగటిల్లి పోతారు? ఆవిడ మీకు....రెండెకరాలూ, బోలెడు రొఖ్ఖం ఇస్తానంది మరి" అంది హాస్యంచేస్తూ.

"నోరుమూద్దూ! వెధవ ఎకరాలు! రెండు కాదు రెండువందలిచ్చినా అమ్ముడుపోతానని మాత్రం అనుకోకు. ఒక్క నీ మాట కాదనలేక అంగీకరించాను, అనుభవిస్తున్నాను. అంతే."

సారథికి కోపం వచ్చిందని గ్రహించిన పద్మ నిజంగానే నోరు మూసుకొంది. సారథి ఫలహారం ముట్టకుండా వెళ్ళి కుర్చీలో కూర్చుని పేపరడ్డుపెట్టుకున్నాడు.

పద్మావతి చాలాసేపు పలకరిస్తాడేమోనని, ఎదురుచూసి లాభంలేక, తనే వెళ్ళి పేపరు తీసేసి చేతులు పట్టుకొంది. సారథి కరిగి నీరై పద్మని దగ్గిరికి తీసుకుంటూ నవ్వేశాడు. పద్మావతి మూతి ముడుచుకొంది-

"మీకసలు సిగ్గులేదు. ఇప్పుడేగా అలిగారు? అప్పుడే నవ్వేస్తున్నారు!" అంది.

"అది నా తప్పుకాదు. భగవంతుడు నాకు సిగ్గు పెట్టలేదు కావున్ను. నేనేం చేసేది?" అన్నాడు సారథి.

"మీకేం మాటలు రావుగనకా? పోసీగానీ వుప్మా చల్లారిపోతూంది. తినేదేమైనా వుందా?"

"ఏమిటిలా రెండుపూటలూ ఫలహారాలూ, పిండి వంటలూ చేసేస్తున్నారు? నే నేమైపోవాలి? ఇప్పటికి అప్పులూ సప్పులూ ఎరగను. ఇకఅన్ని ఆనందాలూ చూపిస్తావు కాబోలు!"

"ఆవిడ చేస్తానని తయారవుతూంటే వద్దని ఎలా చెప్పనేవిటి? ఏదో చూచాయగా అన్నా ఆవిడికి అర్థంకాదు."

"ఎందుకు కాదూ? అర్థం చేసుకోరు. ఇంతకీ నిన్ను మంచి చేసుకొంది. ఆవిడకేం లోటు?"

"ఎంతసేపూ ఆవిణ్ణి ఆడిపోసుకోవటమేగా మీ పని. సరి. ఉప్మా తిందురూ."

"ఈరోజు నుంచీ అన్నీ మునుపటిలానే జరగాలి. నేనిలా దూరం దూరంగా వుండలేను. ఎందుకు సాగదో చూస్తాను. ఉప్మా నువ్వే తినిపించు, తింటాను. లేకపోతే తీసికెళ్ళిపో"

"బావుంది వరస." అంటూ పద్మావతి స్పూన్‌తో ఉప్మాతీసి అందించింది.

"ఓసేవ్! పద్మావతీ! నీ కొడుకెంత అల్లరివాడయ్యాడే తల్లీ!"అంటూ లైన్ క్లియరింగ్‌కోసం కాబోలు ఆండాళ్ళమ్మగారు అరుస్తూ రావటంతో శృంగార ఘట్టంకాస్తా చెదిరిపోయింది. పార్థుడు కోపంతో వూగిపోతూ చేసేదిలేక వుసూరుమన్నాడు.

క్రమంగా సారథి అనే మాటల్లో నిజం వున్నట్టు అనుభవమవుతూ వచ్చింది పద్మావతికికూడా. ఎప్పుడూ ఇద్దర్నీ ఒంటరిగా వుండనివ్వకుండా ఏవో కబుర్లేసుకొని కదలని రథంలా దగ్గిరే కూర్చుంటుంది, ఆండాళ్ళమ్మగారు. సారథి సాయంత్రం ఇంటి కొచ్చేసరికి తనదేదో పడిపోయినట్టు ఎక్కడవున్నా పడుతూ లేస్తూ వచ్చి వీధి గడపలోనే ఎదురై పలకరిస్తుంది. ఒక్కోసారి పూలుకూడా తనే అందుకొని ఎవరూ చూడకుండా మూతి

విరుచుకొంటుంది. "వంటా, వార్పూ చేస్తున్నాను, వడ్డన చెయ్యలేకపోవడ మేం?" అని కాబోలు ఏ పూటా తనే జబర్దస్తీగా సారథికి అన్నం వడ్డించి దగ్గిర కూర్చుంటుంది. ఆవిడ వచ్చాక బొత్తిగా పద్మావతికి సారథి దగ్గిర చేరటానికి వీలుకాకుండా పోయింది. పద్మచుట్టూ తరుమూ చంటిపిల్ల వాడి కన్నా ఎక్కువగా సారథివేసే అల్లరి పోయింది. సారథి సాయంత్రాలు ఆలస్యంగా రావటం సాగించాడు.

ఒకనాడు పద్మ అడిగింది. "ఈ మధ్య ఆలస్యంగా వస్తున్నారేం?" అని.

అసలే చిరాగ్గా వున్న సారథి ఒక్కసారి విరుచుకు పడ్డాడు. "ఆండాళ్ళమ్మని చూడ్డానికి కూడా తొందరగానే రావాలంటావ్?"

పద్మకు నవ్వొచ్చింది. జవాబు చెప్పకుండా వూరుకొంది.

సారథి మళ్ళా అన్నాడు- "నేను ఇంటికి వచ్చేసరికి నువ్వే ఎందుకు ఎదురురావూ?"

"బావుంది. ఆవిడ వీధి గదిలోనే చతికిలబడితే నేనేం చేసేది?"

"ఊం.... సరే! ఈ రాత్రి నుంచీ నాకు నువ్వే అన్నం పెట్టు. తెలి సిందా?"

"తెలిసింది. అన్నం పెట్టమని నన్నే పిలిచి చెప్పండి. తెలిసిందా?" అంది పద్మ.

ఆ రాత్రి సారథి స్నానంచేసి వస్తూ- "పద్మా! అన్నం వడ్డించు" అన్నాడు గట్టిగా.

వెంటనే పద్మ వంటగదిలో కెళ్ళింది.

"నేను వడ్డిస్తాలేవే అమ్మాయ్! నువ్వు పిల్లవాణ్ణి చూసుకో" అంటూ ఆండాళ్ళమ్మగారు ఆపసోపాలు పడుతూ లేచి వచ్చింది వంట గది లోకి.

"నిక్షేపంలా ఆడుకొంటూంటే వాణ్ణేం చూడాలి? నేను వడ్డిస్తాలెండి. మీరు కాస్సేపు కూర్చోండి వాడి దగ్గర" అంది పళ్ళెం కడుగుతూ, పద్మ.

"అయ్యో! నీ మొగుడికి నేనైతేసరిగా పెట్టనని భయమావేమిటే నీకు?" నిష్ఠూరంగా అనేసింది ఆండాళ్ళమ్మగారు.

"ఛ! అవేం మాటలత్తయ్యా! మీరు కాస్సేపు విశ్రాంతిగా కూర్చుం టారనికానీ, పగలంతా ఏదో పని చేస్తూనే వుంటారుకదా?" అంటూ పళ్ళెం

అక్కడ పెట్టేసింది పద్మావతి.

"ఆఁ, నాకలా ఖాళీగా కూర్చోవాలని వుండదే తల్లీ." అంది, ఆండాళ్ళమ్మగారు వడ్డనకు ఉపక్రమిస్తూ.

అంతా వింటున్న సారధి- 'అవును, నీకు ఎవరి ప్రాణాలైనా తియ్యాలని వుంటుంది' అనుకున్నాడు మంటగా. ఏమీ ఎరగనట్టు— "పద్మా! అన్నం పెట్టావా?" అంటూ పోలిలేకలేస్తూ వచ్చాడు వంట గదిలోకి.

"ఆఁ, ఆఁ, వడ్డించాను రారా! రోజు నేను వడ్డించటంలా? ఇవ్వాళ పెళ్ళాన్ని పిలుస్తున్నావ్‌గానీ!" అంటూ నవ్వేసింది ఆండాళ్ళమ్మగారు.

"అబ్బే పెద్దదానివి. నిన్ను శ్రమ పెట్టడం దేనికని," నసుగుతూ పీటమీద కూర్చున్నాడు సారధి.

"ఏమిటో నాయనా! నువ్వు నా బిడ్డలాంటి వాడివి. నా చేతుల్తో దగ్గర వుండి తినిపించాలని పిస్తుంది." ప్రేమ గరిటెలతో తీసి మరీవడ్డిస్తోంది ఆండాళ్ళమ్మగారు. పద్మ గదిలో కూర్చుంది గోళ్ళు గిల్లుకుంటూ. సారధికి పద్మను చూస్తే వుసూరుమనిపించినా, కోపం కెరటాలు వేసుకొంటూ వచ్చింది.

"నువ్వు వచ్చాకే పెద్దమ్మా! నమ్ము నమ్మకపో, నాలుగు మెతుకులు నోట పెడుతున్నాను. అదేమిటో దాని కసలు వంటేరాదూ! పచ్చడి పులుసులా చేస్తుంది; పులుసు పాకంలా కాస్తుంది; పాకం...." కసిగా చెప్పుకుపోతున్నాడు సారధి.

"నమ్మక పోవటం ఏమిట్రా? నీ పెళ్ళాంమీద నువ్వే అబద్ధాలాడుకుంటావా ఏమిటి? పెళ్ళికీ ఇప్పటికీ ఎంత చిక్కి శల్యమై పోయావనీ? పాపం దానికి మాత్రం ఏమి తెలుసురా! కుర్ర సన్యాసి. ఇక బెంగెందుకులే, నేనున్నానుగా?" ఆండాళ్ళమ్మగారు వోదారుస్తుంటే సారధి నవ్వాడు. కాని పద్మ ముఖం ముడుచుకొంది. అది చూచి మరీనవ్వాడు. పద్మావతి లేచి వెళ్ళిపోయింది. 'ఆండాళ్ళమ్మకూ-పద్మావతికీ కీచులాట పెట్టాలనే ప్రయత్నంలో కొంచెం కొంచెం ముందుకు పోతున్నానా?' అనుకున్నాడు సారధి.

సారధి భోజనం అయ్యాక పద్మ ముభావంగా నాలుగు ముద్దలు మింగి వంటగది యావత్తు అత్తగారికి అంకితం చేసి గదిలో కొచ్చి పెడ

మొహంగా కూర్చుంది. సారథి నెమ్మదిగా దగ్గర చేరాడు "ఆండాళ్ళమ్మ చూశావూ నువ్వంటే ఎంత ప్రేమగా మాట్లాడుతోందో?"

పద్మ విసురుగా— "అవిణ్ణి అనుకోవడం దేనికి? కాగువెళ్ళి కడుగు ముంతలో దూరిందట.అసలువాళ్ళే లోకువిస్తే పరాయివాళ్ళు అనటానికేం?" అంటూ మొహం తిప్పుకొంది.

సారథి నవ్వాడు పకపకా. "చూడు పద్మావతీ! నేను ఏది అన్నా హాస్యానికే అంటాననీ— ఆండాళ్ళమ్మగారు నిజంగానే అంటుందనీ నీకు తెలుసు. నీకు తెలిసినా దాచుకుంటున్నావని నాకు తెలుసు. ఏమంటావ్?"

పద్మ ఏమీ అనలేదు. నిజంగా ఆండాలమ్మగారి మీద కోపం లేదు. ఆవిడ భోళా భోళీ మనిషనీ- అందుకే అన్నిటికీ సరదాపడుతుందనీ పద్మావతి ఉద్దేశ్యం.

సారథి పద్మ గడ్డం పుచ్చుకుని సహజమైన ధోరణిలో చెప్పసాగాడు -"పద్మా! నిజంగా చెపుతున్నాను. భోజనం విషయం నాకు మరీ కష్టంగా వుంటోంది. ఏపూటా ఇద్దరం ఒక్కసారే కూర్చుని ఒక్కపళ్ళెంలో తిన్నట్టు తినేవాళ్ళం. ఛ! రానురాను, ఏ సరదా లేకుండా పోతోంది. నువ్వు కూడా పక్కన కూర్చొని, తినకపోతే నాకు ఏమిటో వెలితి. కనీసం నువ్వే వడ్డించినా కొంత తృప్తి."

పద్మ మాట్లాడకుండా దిండుబో తలదూర్చిపడుకొంది.

*　　*　　*　　*

లేచే సరికి కరకరా పొద్దెక్కింది. ఆండాళ్ళమ్మగారు కాఫీగిన్నె దించుతూ అప్పుడే లేచి వస్తున్న పద్మావతి కేసి చురచురా చూసి ప్రారంభించింది. - "నీకు కోపం వస్తే చెప్పలేను గాని అమ్మాయ్! ఆడదాని కిది లక్షణం కాదు. ఎంచక్కా తొలికోడి కూయగానే లేచి లక్షణంగా పాడీ వంటా చూసుకొని-" అంటూ.

కమ్మటి నిద్రలో రాత్రి విషయం మరిచిపోయిన పద్మ చిన్నగా నవ్వుతూ అంది- "అంత పొద్దుటే లేచి ఎవరి పాడికుండ తెచ్చి చెయ్యమంటా రత్తయ్యా?"

"ఇదేం చోద్యమే తల్లీ! పాడికుండ కాకపోతే మరోపనీ. ఆడదానికి ఒళ్ళు వంగాలే గానీ సంసారంలో పనిపాటలే కరువవుతాయా? నీకు కోపం వస్తుందో ఏమోగానీ నేనైనా ఒక్కదాన్ని చెయ్యలేను సుమా?" అంటూ

నిలువు గ్లాసుతో డబుల్ స్ట్రాంగ్ కాఫీ తెచ్చుకుని గడపలో చతికిలబడింది ఆండాళ్ళమ్మగారు.

"కోపం ఎందుకత్తయ్యా? ఏమిటో ఆరు గంటలైనా మెలకువ రాదు. పాడు అలవాటై పోయింది" అంటూ పద్మావతి అరచేతిలో పళ్ళ పొడి ఒంపుకొని దొడ్లోకి వెళ్ళింది.

పొద్దున్నే లేవటం లేదనో, పని పాటలు లక్షణంగా చేసుకోవటం రాదనో, మడిపంచె తెల్లగా పిండి పెట్ట లేదనో, అత్తలన్నా మొగుళ్ళన్నా ఈ కాలం పిల్లలకు బొత్తిగా లక్ష్యం పాడూ లేదనో, ఏదో ఒకటి ఎత్తి చూపించి వంకలెట్టి "మీ మంచికే చెప్తున్నానే తల్లీ!" అంటూ మరి సతాయించడం ఆండాళ్ళమ్మగారి దాదాపు దినచర్యగానేవుంది. ఆదిలో చిన్న చిన్న చిరునవ్వులు విసిరేసి వూరుకునే పద్మావతికి అత్తగారి సాధింపులూ, హితవచనాలూ, మిరియాల కషాయాలాగా, చేదు మాత్రలలాగా రకరకాలుగా- అనిపించసాగాయి. రోజురోజుకూ ఓ మెట్టు పైకి జరుగుతూన్న అత్తగారి అలవాటు, కోడలికి పొరపాటు అనిపించటం ప్రారంభమైంది. అత్తగారి పరిపాటు కోడలికి గ్రహపాటులా కూడా తయారైంది.

"నా సంసారం మంచీ చెడ్డలు నాకు తెలీవేం? ఏదో పెట్టి పోషిస్తున్నట్టు ఈ సాధింపు లేమిటి వెనక!" అని పద్మావతి లోలోపలే విసుక్కుని పైకి మొహం మాత్రం చిట్లించుకుని వూరుకునేది. ఆండాళ్ళమ్మగారు ఎన్ని చదువుతున్నా సూటిగా జవాబు చెప్పడం పద్మావతికి ఇంకా ఒంటబట్టలేదు.

అటువంటి పరిస్థితుల్లో ఒకనాడు వంటగదిలో....

పద్మావతి అత్తగారికి సాయం చెయ్యటానికి దోసకాయలూ, కత్తిపీటా ముందు వేసుకు కూర్చుంది. దోసకాయలు మెత్తబడి వున్నాయేమో సన్నగా ఉల్లిరేకులా పై పొర చెక్కాలంటే వీలుగాక పెద్ద పెద్ద చెక్కలు తీసేసింది. అది చూసిన ఆండాళ్ళమ్మగారు "హవ్వ!" అంటూ బుగ్గన వేలు ఆనించుకొని- "ఇదేం చోద్యమే తల్లీ! దోసకాయలు చెక్కడమే రాకపోవడానికి ఆడదానివి కాదుటే?" అంటూ ప్రారంభించి- "ఏం పెంపకాలో తల్లీ! ఆడపిల్ల లక్షణంగా పనిపాటలు నేర్చుకోవద్దూ!కట్టుకున్నవాడైనా...." వరకూ చదివి తప్పంతా పద్మావతి తల్లిదేనని ఖచ్చితంగా తేల్చి వూరుకుంది.

దారేపోయే అత్తగారు అప్పనంగా చేస్తూన్న అథార్టీకి పద్మావతికి

ఆశ్చర్యమూ, అంతకు మించిన ఆగ్రహమూ కలిసివచ్చాయి. "ఈ మాత్రం భాగ్యానికి ఎక్కడో వున్న పెద్దదాన్ని మాటలనటం ఎందుకూ? నా పనిపాటలు గురించి మీరింత బాధపడనక్కర్లేదు లేండి" అనేసి విసవిసా వెళ్ళి గదిలో మంచంమీద కూర్చుంది.

సారధి నెమ్మదిగా దగ్గర చేరాడు- "ఆండాళ్ళమ్మతో దెబ్బలాడావా ఏమిటే పద్మావతి?"

"బావుంది. ఆవిడతో నేనెందుకు దెబ్బలాడతానూ?"

"అదే....దోసకాయులేదో చేశావని సాధిస్తోంది కదూ?"

"అంటే అంటుంది చేతకానిపనులు చేస్తే అనరూ?"

"అహ్హహ్హహ్హ!" అంటూ పార్థుడు బ్రహ్మాండంగా బ్రహ్మాండం బ్రద్దలయ్యేలా నవ్వాడు. "ఏం జరిగినా సహిస్తానని ఇదివరకే చెప్పావ్ కదూ? అక్షరాలా సహిస్తున్నావ్. నా దగ్గరా నీ దాపరికం పద్మావతీ? ఆ దారేపోయే అత్తగారికి ఇంత సేవ చేస్తున్నావుగాని ప్రయోజన మేమైనా ఉందా? ఆ సేవలో కందిగింజంతైనా, పోనీ ఆవగింజంతైనా నిన్ను కట్టుకొని- నీ కొంగు పట్టుకొని-నువ్వే సర్వస్వంగా భావించే-నిన్నేదేవతగా పూజించే...."

పద్మ లేచి రుసరుసలాడుతూ మళ్ళా వంటగదిలోకెళ్ళి పోయింది.

సారధి హృదయం సంతోషంతో గంతులేసింది. "పద్మావతికీ, ఆండాళ్ళమ్మకూ యుద్ధం ప్రారంభమైంది. అది పరాకాష్ఠ నందుకోటానికీ, అండాళ్ళమ్మ బయటకు నడవటానికీ, ఇక ఎన్నోరోజులు పట్టదు. నిశ్చింతగా వుండు పార్థా!" సారధి తనలో తాను పార్థుడి వీపు చరిచి ధైర్యం చెప్పకున్నాడు. హుషారుగా ఈల వేశాడు.

ఆ హుషారుతోటే సాయంత్రం మరీ తొందరగా ఇంటికి వచ్చేశాడు. వీధిగడపలో అడుగుపెట్టి లోపలికి చూపులు సారించాడు. ఒక్కసారి సారధి నడుం—లెదర్ బెల్టు పెట్టుకొనే వున్నప్పటికీ- ఫెళ్ళుమని విరిగి పోయింది ఆ అమితాశ్చర్య సంభరిత దృశ్యం ఒకేసారి చూచి మరి చూడ లేక కండ్లు మూసుకుని కుంటు కుంటూ లోపలికి నడిచాడు. ఆండాళ్ళమ్మ గారూ-పద్మావతీ నిజం అత్తాకోడళ్ళలానే కలకలా కిలకిలా నవ్వేసుకుంటూ జోరున గవ్వలు గులకరించి పోస్తూ పచ్చీసు ఆడేసుకుంటున్నారు. సారధి ఉసూరుమంటూ కుర్చీలో కూలబడ్డాడు. పద్మావతి ఆట చాలించి లేచి వచ్చింది. వస్తూనే నిండైన చేతులు సారధి మొహం మీద పెడుతూ....

"గాజులు చూశారూ? అత్తయ్య వేయించారు. గాజులవాడు వెళ్తూంటే పిలిచి వేయించుకోమని పట్టుపట్టారు. వద్దంటున్నా వినిపించుకోకుండా డబ్బులు ఆవిడే ఇచ్చారు. పాపం ఆవిడ చాలా మంచిదండీ! మన మంచికే అలా అంటుందిగానీ" అంది.

"అయిందా నీ సోది? ఆవిడా మంచిదే, నువ్వూ మంచిదానివే, అందరూ మంచివాళ్ళే! ఎటొచ్చీ నేనే కుళ్ళు వెధవను."

పద్మ తెల్లబోయింది. సారధి చాలా కోపంలో వున్నాడని గ్రహించి రెండు నిమిషాలు మౌనంగా నిలబడి మెల్లగా జారుకుంది.

ఓ అరగంటసేపు సారధి అక్కడే మౌనంగా గదిలో పచార్లు చేశాడు. ఆలోచనలు పరిపరివిధాల పరుగులెత్తాయి. "అమ్మా! ఆండాళ్ళమ్మా! ఎంత తెలివైనదానివి! నీ బుర్ర వెంటనే తీసి రష్యా పంపించాలి. పద్మతో వ్యవహారం బెడిసికొడితే నీ ఆటలు సాగవని గాజులు వేయించి మంచి చేసుకున్నావా? సరేలే, దేనికైనా సమయం రావాలి" అనుకున్నాడు. శాంతంగా ఆలోచిస్తే పద్మను అనవసరంగా కసిరానేమో ననిపించింది. పద్మతో కాస్సేపు కబుర్లేసుకోవాలనీ, లేకపోతే ఇద్దరూ ఎటైనా తిరిగి రావాలనీ మనసు పోయింది. వెంటనే "పద్మా" అని పిలిచాడు. పద్మ మౌనంగా హాజరు పలికింది. సారధి, దగ్గరికెళ్ళి పద్మావతి భుజంమీద చేయి వేశాడు.

"సినిమాకు వెళ్దామా?"

"ఇప్పుడా?"

"ఏం! ఐదు నిమిషాల్లో రెడీ కాలేవూ? బాబుని కూడా మీ అత్త గారిదగ్గర వుంచేసి మనం ఇద్దరం వెడదాం. మనం వెళ్ళి చాలా రోజులైంది పద్మా!"

"ఆవిణ్ణి తీసుకెళ్ళకపోతే ఏమైనా అనుకోదూ?"

"ఏమీ అనుకోదు. మొన్ననేగా అంతా వెళ్ళాం? నువ్వు మాత్రం వెధవ తద్దినాలు పెట్టకు. తొందరగా తయారవ్వు."

"సరే! చెప్పివస్తాను" అంటూ పద్మ లోపలికెళ్ళింది. ఆ వార్తకాస్తా అత్తగారి చెవినివేసి "బాబుని ఉంచండత్తయ్యా!" అంది.

ఆండాళ్ళమ్మగారి జీవాలు తల్లడిల్లి కడంటి పోబోయాయి.

"అమ్మో! నువ్వు లేకపోతే వాడు నా దగ్గర వుండడే తల్లీ!" అంది ఎంతమాత్రం వీల్లేనట్టు.

"మీకు బాగా చేరికైపోయాడని ఇందాకే కదా అన్నారత్తయ్యా! పోసీలెండి, వాణ్ణి కూడా తీసుకెళ్తాను" అంది పద్మ మామూలుగా.

ఆండాళ్ళమ్మగారి హృదయం ఘోషపెడుతోంది. ఇంత అన్యాయమా? ఇంటిల్లిపాదీ ఎంచక్కా సినిమా చూస్తారా? తను ఇంటిదగ్గరపడి వుంటుందా? వీల్లేదు. ఎంతమాత్రం వీల్లేదు.

"అయితే నన్నొక్కదాన్నీ ఇంట్లో వుండమంటావటే పద్మావతీ? ఈ పాడు బస్తీలో ఎప్పుడేం జరుగుతుందో.... ఏ దొంగ వెధవో కనిపెట్టి ఒక్కదాన్నీ చేసి పీక పిసికేసినా ఇక్కడ నా కెవరే దిక్కు?"

"ఛా! అటువంటి ఘోరా లెలా జరుగుతా యత్తయ్యా? ఇరుగు పొరుగువాళ్ళు లేరూ?"

"ఏమో తల్లీ! నేనూ సినిమాకు వస్తానే! ఈ పాపిష్టికళ్ళు పెట్టుకొని ఆ సినిమా అన్నా చూస్తాను. పుణ్యం పురుషార్థమూనూ." ఆండాళ్ళమ్మగారు కడుపులో కోరిక కాస్తా బయట పడేసి ఉస్సురని నిట్టూర్చి గుడ్లప్పజెప్పి కూర్చుంది.

పద్మావతి గొంతులో భోషాణం అడ్డుపడింది. ఈ సంగతి ఆయనగారితో ఎలా చెప్పాలి? ఎలానో చెప్పేసింది. "ఆవిడా వస్తుందట. ఒక్కతీ వుండలేదట. పాపిష్టి కళ్ళతో సినిమా అన్నా చూసి పుణ్యం సంపాదించుకొంటుందట. మీకు చెప్పాలనే వచ్చాను" అంది తన దోషమేమీ లేనట్టు.

సీరియస్‌గా అంతా విని తల తాటించాడు సారథి. "ఓహో! ఇప్పుడే అకస్మాత్తుగా ఆండాళ్ళమ్మకు పాపభీతి, దైవభక్తీ పుట్టుకొచ్చాయేమిటి?" అని బయటికి వచ్చాడు. "నువ్వు సినిమా కొస్తానన్నావట పెద్దమ్మా! ఇది పెద్దవాళ్ళు చూసే మంచి సినిమాకాదు పెద్దమ్మా! వెధవది. ఉత్తపోకిరీ సినిమా! లేకపోతే నిన్ను తీసుకెళ్ళకుండా వెళతామా?" అన్నాడు శాయశక్తులా నటిస్తూ. "ఓ వారం రోజుల్లో 'ఏడేళ్ళశనీ' 'నెత్తిమీద తద్దినం' సినిమాలు వస్తున్నాయి. అప్పుడు నిన్ను తీసుకెళతాను."

ఆండాళ్ళమ్మగారు అతి నిర్లక్ష్యంగా నవ్వేసింది. "నా మొహం నాకేం మంచి చెడ్డలు కావాలిరా? చదువులూ సంధ్యలూ అన్నీ ఎరిగిన వాళ్లు మీరే చూడగాలేంది పిచ్చి ముండని నాకు మంచేవిట్రా? ఏదో మీరు చూసేదే నాకూ చూపించరా!"

సారథి మూతి బిగించుకొని పళ్ళు నూరుకున్నాడు. పద్మావతి, కొంగు

అడ్డు పెట్టుకొంది. "సినిమా మానిపారేద్దాం" అనిపించింది సారధికి. వెధవది, ఇంత చిన్న విషయానికి అండాళ్ళమ్మదగ్గర తేలిపోవటం ఇష్టంలేక- "సరే! బయల్దేరండి" అనేసి చరచరా వెళ్ళిపోయాడు.

★ ★ ★ ★

"సినిమా బావుండదన్నావేంరా? ఎంచక్కా వుంటేనూ. ఆ శాంతమ్మ తల్లికాబట్టి రాకాసుల్లాంటి కోడళ్ళతో వేగగలిగింది" అంటూ మరునాటి వుదయం కాఫీ గుటకలేస్తూ రాత్రి చూసిన సినిమాని అండాళ్ళమ్మగారు ఒకటే మెచ్చుకోవటం సాగించింది.

సారధి లేచివస్తూ- "ఈ అండాళ్ళమ్మ ఆ శాంతమ్మను మెచ్చుకొంటోంది పద్మావతీ?" అన్నాడు నెమ్మదిగా. పద్మ నవ్వి వూరుకొంది.

సినిమా కబుర్లు దొర్లిపోతూంటే పార్థసారధికి టీ పార్టీ ఆహ్వానం వచ్చింది. "చెల్లీ! నువ్వూ బావగారూ నాలుగు గంటలకల్లా తప్పకుండా రావాలమ్మా! ఈసారికూడా నన్ను నిరాశపరిస్తే వూరుకోనుమరి" అంటూ జబర్దస్తీగా ప్రాధేయపడి- "మర్చిపోకండి!" అంటూ ఓ పదిసార్లు హెచ్చరించి ఆ వచ్చిన మనిషి హడావిడిగా వెళ్ళిపోయాడు.

"పద్మా! ఈ సారి వెళ్ళకపోతే మర్యాదగా వుండదు. మధ్యాహ్నం తొందరగా వచ్చేస్తా! మూడు గంటలకల్లా రెడీగావుండు!" తువ్వాలు తీసుకొని స్నానానికి వెళ్ళిపోయాడు సారధి. పద్మావతి వంటగదిలోకి వెళ్ళింది అండాళ్ళమ్మగారు నిండా దిగులుపడిపోయింది. కాఫీగ్లాసు పక్కనే పడేసి దిగులుగా కూర్చుండిపోయింది.

సారధి ఆఫీసుకు వెళ్ళిన తర్వాత కోడలిదగ్గర చేరింది. "అమ్మాయ్! పద్మావతీ! నేనుండగా నువ్వెందుకే చెయ్యి కాల్చుకుంటావూ? ఏ పుస్తకమో చదువుకొంటూ కూర్చోరాదూ? వంటా అదీ నే చూచుకుంటాను."

"అంతా పూర్తి అయిపోవచ్చిందత్తయ్యా! ఎవరుచేస్తే ఏమిటిలెండి"

"అది సరేగాని అమ్మాయ్! సాయంత్రం ఎక్కడికే వెళ్ళాలంటున్నాడు పార్థుడూ?"

"ఇందాక వచ్చాడు కదూ ఒకాయన. ఆయన తమ్ముడి పెళ్ళయింది. పెళ్ళికూతుర్ని తీసుకొచ్చారట. టీ పార్టీ ఇస్తున్నారు."

అండాళ్ళమ్మగారు కాసేపు మౌనం వహించింది గానీ అంతకన్నా ఎక్కువసేపు వుండలేకపోయింది. "అమ్మాయ్! మీరు వెళ్ళేచోటుకు నేనూ

రాకూడదేమిటే?" అనేసింది. కడుపుకాస్తా తేలికపడింది.

పద్మావతి తెల్లబోయింది. ఏం చెప్పాలో తోచలేదు. కాస్సేపు ఆలోచించింది. "ఏమో అత్తయ్యా! ఆయన్ను రానివ్వండి, అడుగుతాను" అంది.

"మా తల్లివే! అడుగమ్మా! అడుగు. ఏమిటో పెద్దముండను. ఈ పాపిష్టికళ్ళతో పాపం పుణ్యం చూడాలనిపిస్తుంది. మొన్ననోసారి సముద్రం చూపించావా? ఆ మహాగంగనిచూచి ఎంత సంతోషపడి పోయాననీ! నిన్న సినీమా మాత్రం? ఎంచక్కా మంచీ చెడ్డా అన్నీ చూపించావు. పరాయిదాన్నయితే ఏం? స్వంత అత్తగారికన్నా ప్రేమగా చూస్తున్నావు. ఇక నాకు నీకన్నా...."

ఆండాళ్ళమ్మగారు చదువుకుపోతూంటే— "పాపం! పెద్దవయస్సు, అన్నీ చూడాలనిపిస్తుందేమో!" అనిపించింది పద్మావతికి.

సాయంత్రం నాలుగు గంటలకు ముందే సారధి వచ్చేశాడు "పద్మా! పదినిమిషాల్లో తెమలాలి సుమా!" అంటూ.

ఆండాళ్ళమ్మగారి కబురు అడగాలంటే తగని భయం వేసింది పద్మావతికి కానీ వెనక ఆండాళ్ళమ్మగారు సైగలు చేస్తోంటే ఎలానో ధైర్యం కూడగట్టుకొని గదిలోకి వెళ్ళింది "మీ పెద్దమ్మగారుకూడా వస్తుం దటండీ! పొద్దుటినుంచీ నన్ను చంపుకు తింటోంది" గబాగబా అంతా చెప్పేసి వూరుకుంది.

సారధి చిత్రంగా చూశాడు. ఆ చూపు గ్రహించిన పద్మావతి- "నన్నేం చెయ్యమంటారు? మిమ్మల్ని అడుగుతానని చెప్పాను" అంది నెమ్మదిగా.

సారధి కొంచెం శాంతంగా ఆలోచించాడు. "ఆఁ, ఒకటి చెయ్! నేను చెప్తే బాగుండదు. కానీ, అక్కడ కిరస్తానీవాళ్ళూ తురకవాళ్ళూ ఇంకా వాళ్ళూ వీళ్ళూ బోలెడుమంది వుంటారట అని చెప్పేయ్. మడి అంటే పడిచస్తుంది కదూ?" అంటూ తెలివిగా ఉపాయం చెప్పాడు.

పద్మావతి లోపలి కెళ్ళేసరికి ఆండాళ్ళమ్మగారు కాచుక్కూర్చుంది. "అక్కడంతా కిరస్తానీవాళ్ళూ వీళ్ళూ వుంటారటత్తయ్యా! మీరు రాకూడ దంటున్నారు ఆయన" అంది నెమ్మదిగా పద్మావతి.

ఆండాళ్ళమ్మగారి గుండె గతుక్కుమంది. "ఎలా అత్తయ్యా! మీరు రావటానికి మీకు మడికదా?" అని అడిగింది పద్మ.

పాపం ఆండాళ్ళమ్మగారికి వెధవ మడీ దడీ కత్తుల్లా కనిపించ సాగాయి. తన అంటూ సొంటూ వాళ్ళిద్దరికీ తెలుసయ్యే! వస్తానని ఎలా పట్టుబడుతుంది? పాపం ఆండాళ్ళమ్మగారు చారుడు మొహమూ అర్ధణా బిళ్ళంత చేసుకొని ఉసూరుమంటూ నిట్టూర్చింది. కానీ అటువంటి సమయా ల్లోనే ఆండాళ్ళమ్మగారి బుర్ర అమోఘంగా పనిచేస్తూ వుంటుంది. "అయితే అమ్మాయ్! నేను రానుకానీ నువ్వుమాత్రం అటువంటిచోటుకి ఎలా వెళ తావు! ఛా పాడు" అంది ఛీ కొడుతూ.

"నేను వెళ్ళకపోతే ఆయన వూరుకోరత్తయ్యా!" అంది పద్మ తన అసహాయతను వెల్లడిస్తూ.

"వూరుకోకేం చేస్తాడూ? నేను చెప్తాను. నువ్వు మాత్రం వెళ్ళొద్దు" అంది ఖచ్చితంగా. పద్మావతి గడ్డకట్టి నించుంది.

"పద్మా! అబ్బ! ఏమిటి నీ ఆలస్యం?" అంటూ వచ్చాడు సారధి.

"నీకు మతిపోయిందిట్రా? అటువంటి చోట్లకు దాన్నెలా తీసుకెళ తావూ? పోనీ నువ్వు వెళ్ళిరా! మగవాడివి" సారధి వెళ్ళడానికిమాత్రం ఆజ్ఞ ఇస్తూంటే సారధికి నవ్వు వచ్చింది.

'అమ్మా! ఆండాళ్ళమ్మా! ఎత్తుకు పై యెత్తు వేశావా?' అను కున్నాడు.

"ఆఁ మరేం ఫర్వాలేదు. వెళ్ళకపోతే అమర్యాదగా వుంటుంది. వచ్చాక తలంటుకుంటుందిలే. పద్మా! ఇంకాఅలా నించుంటావేం బొమ్మలా? తొందరగా బయల్దేరేదేమైనా వుందా?" అంటూ పెళ్ళాంమీద విరుచుకు పడ్డాడు. గడ్డకట్టిన పద్మావతి కదిలి నడిచింది.

పద్మావతి ముస్తాబు చేసుకుంటుంటే గుడ్లుపెట్టుకుచూస్తూకూర్చుంది ఆండాళ్ళమ్మగారు. చూడగా చూడగా ఆవిడకు కలవరం పుట్టింది. తగని కోపం వచ్చేసింది. "పిల్లవాణ్ణి కూడా తీసుకెళ్ళిపో అమ్మాయ్! ఆ గుంపులో గొలుసు భద్రంగా వుంటుందో లేదో తీసిదాస్తాను" అంటూ లేచింది.

చొక్కాచేతులు మడతలు పెట్టుకుంటూన్న సారధి కలగజేసుకొని- "ఈ ఒక్కసారికి నువ్వే వుంచాలి పెద్దమ్మా వాణ్ణి" అన్నాడు.

"నా దగ్గర వుండడురా నాయనా! లేకపోతే నాకేం బరువా, భారమా?"

"బిస్కట్లు పెడితే సరి. వాడే వుంటాడు" అంటూ అలమారులోంచి బిస్కట్ల డబ్బాతీసి కింద పడేశాడు సారథి.

చూస్తూ చూస్తూ వుండగానే పార్థసారథీ, పద్మావతీ సింగారించుకొని చెట్టాపట్టా లేసుకొని వీధిలోకి వెళ్ళిపోయారు.

'హతోస్మి!' ఆండాళ్ళమ్మగారు ఓడిపోయింది. కసిగా పిల్లవాణ్ణి కింద కుదేసి ఒక్కవిసురున బిస్కట్ల డబ్బా ముందుకు లాక్కుని కూర్చుంది.

భార్యామణితో జంటగా వీధిలోపడ్డ పార్థసారథి వేయిగండాలు దాటి వచ్చినట్లు గాలివదిలాడు. "హమ్మయ్య! ఆండాళ్ళమ్మను జయించగలిగాను. వచ్చేవరకూ వస్తామంటే నమ్మకం లేదు. ఇవ్వాళైనా ఈ పార్టీ చూచుకుని అలా బీచ్‌కిపోయి కాస్సేపు తిరిగివద్దాం."

"ఆలస్యంగా వెళ్తే ఆవిడేం గొడవ పెడుతుందో!"

"ఆమాటా నిజమే. ఆండాళ్ళమ్మని తేలిగ్గా తీసిపారెయ్యటానికి వీల్లేదు. ఏమిటో అనుకున్నానుగానీ ఆండాళ్ళమ్మ బుర్ర మహా చురుకైంది. అటువంటివాళ్ళకే కీలెరిగి వాత వేస్తూండాలి."

దంపతు లిద్దరూ పార్టీకి హాజరై అటుతర్వాత బీచ్‌లో ఓ గంట గడిపి నిబ్బరంగా ఇంటికిజేరేసరికి తొమ్మిది దాటింది. బాబునిద్రపోతున్నాడు. వీధి తలుపులు తీసి వెళ్ళి ముసుగుతన్ని పడుకుంది ఆండాళ్ళమ్మగారు.పద్మ కంగారుగా అడిగింది-"అదేం అత్తయ్యా! ముసుగు పెట్టుకు పడుకున్నారు?"

"నాకు ఒంట్లో బావులేదేతల్లీ! అందుకే వంట చెయ్యలేదు. చేసుకో" అనేసి అటు తిరిగిపోయింది ఆండాళ్ళమ్మగారు.

పద్మ అత్తగారి ఒంటిమీద చెయ్యివేసి చూసింది వేడే లేదు.

"ఏమీ లేదు. అంతా నటన" అనుకుంది పద్మ.

"నన్ను పరీక్ష చేస్తున్నావుటే? అబద్ధాలాడుతున్నానా?" అంది ఆండాళ్ళమ్మగారు నిష్ఠూరంగా. పద్మ మాట్లాడకుండా లోపలికెళ్ళింది. బిస్కట్ల డబ్బా కాలికి తగిలితే తీసి అలమారాలో పెట్టబోయింది. అందులో మరి అయిదారు బిస్కట్లు మాత్రం మిగిలి వున్నాయి. పద్మావతి విస్తుబోయింది. క్రిందటి రోజే సీలు తీసిన డబ్బా! వెళ్ళేసరికి నిండుగా వుంది. అన్నీ బాబు తినేశాడా?

"ఛా! ఏం మనిషి!" అనిపించింది మొట్టమొదటిసారిగా పద్మావతికి

అండాళ్ళమ్మని గురించి. ఆ డబ్బా పట్టుకొని సారథి దగ్గిరికెళ్ళింది. "చూశారా! మనం తీసుకెళ్ళలేదని కోపం వచ్చింది కాబోలు. ముసుగు బిగించి పడుకుంది. వంటా గింటా ఏం చెయ్యలేదు. పైపెచ్చు బిస్కట్లన్నీ తినేసింది. పిల్లాడు తిన్నాడంటే నమ్మేస్తాననుకుంది కాబోలు." పద్మావతి అండాళ్ళమ్మగారి చేష్టలు వర్ణిస్తుంటే అవి పార్థుడి చెవులకు కృష్ణలీలలుగా సోకుతున్నాయి. తన్మయత్వంలో మునిగి సానబెట్టిన రత్నంవంటి ఉపదేశం ఒకటి చేశాడు- "పద్మావతీ! ఇప్పుడిప్పుడే నీకు జ్ఞానోదయంబగుచున్నది, త్వరలోనే నిజము తెలుసుకొనగలవు. వెంటనే వెళ్ళి వంట చేసుకొనుము."

"మీరూసరే!" అంటూ వెళ్ళిపోయి బట్టలు మార్చుకొని వంటలోకి దిగింది పద్మావతి. చేటలో బియ్యం కనిపించలేదు. సరికదా వాటి స్థానే ఓ అరవీశెడు పుచ్చు వంకాయలు ప్రత్యక్షమయ్యాయి- "అత్తయ్యా! వంకాయలు మీరు కొన్నారా? చేటలో మధ్యాహ్నం ఏరి వుంచిన బియ్యం కనిపించటం లేదేం?" అంది అత్తగారి దగ్గరకెళ్ళి.

"మంచి వంకాయలు వస్తేనూ వదిలిపెట్టలేక బియ్యం యిచ్చి కొన్నానే" అంది ఆండాళ్ళమ్మ ముసుగులోంచే.

పద్మ విస్తుపోయింది. "ఏమిటీ! మూడు తవ్వల బియ్యం పోసి అరవీశెడు పుచ్చు వంకాయలు కొన్నారా?" అంది విసురుగా.

ఆండాళ్ళమ్మగారు దిగ్గున లేచి కూర్చుని- "మూడు తవ్వ లెక్కడున్నాయే? శేరుకూడా లేవు. ఈ కాలంలో వంకాయల ధర ఎక్కువకాదూ? అర్ధవీశెకూ అర్ధరూపాయి కట్టి శేరు బియ్యం ఇచ్చాను. పుచ్చులంటావేం? నిక్షేపంలా వుంటేనూ!" అంది.

పద్మ ం నిజంగానే కోపం వచ్చింది. "శేరు బియ్యం వుండటం ఏమిటి? ఈ పూటకూ రేపొద్దుటికీ వుంటాయని నా చేతుల్తో నేను మధ్యాహ్నం మూడు తవ్వల బియ్యం. ఏరి వుంచాను" అంది నిక్కచ్చిగా.

"అయితే ఆ తవ్వెడూ నేను అమ్ముకున్నా నంటావేమిటే, దొంగతనాలుకూడా కడుతున్నావుటే తల్లీ! హయ్యోరామా!" అంటూ గొంతు శ్రుతిచేసుకోబోయింది ఆండాళ్ళమ్మగారు.

ఈ భాగవతమంతా సారథిగాని వింటే చీవాట్లు పెడతాడని నోరు మూసుకొని వంటగదిలో కెళ్ళిపోయింది పద్మ. "మనిషిని నమ్మి ఒక్క-

పూట ఇంట్లోవుంచి వెళ్తే ఎంతపని చేసిందీ! బియ్యం అన్నీ ఏ కూరల మనిషికో అమ్మేసింది. పైగా దొంగతనంకడతావా? అంటూ రాగాలు తీస్తోంది. ఇటువంటి మనిషిని నమ్మివుంటే ఇంకేమైనా వుందా!" అనుకుంది వంటచేస్తూ.

కాస్సేపటికి ఆండాళ్ళమ్మగారు లేచి వచ్చింది వంటగదిలోకి. తనకు తనే కలుగజేసుకొని కోడలిని పలకరించింది. "అక్కడ మీకు ఏమేం పెట్టారేమిటే అమ్మాయ్? ఆ పార్టీ అదీ బాగా జరిగిందా?" అంటూ చతికిల బడింది.

"ఆఁ, అంతా బాగా జరిగింది. మైసూరుపాకులూ, జిలేబీ, కారం బూందీ పెట్టి టీ ఇచ్చారు" అంది పద్మ ముభావంగా అన్నం వారుస్తూ.

కాస్సేపు కూర్చుని "సరేనమ్మా, కూర్చోలేకపోతున్నాను. వెళ్ళి పడుకుంటాను" అంటూ మాడ్చుకున్న మొహంతో గదిలోకి వెళ్ళిపోయింది ఆండాళ్ళమ్మగారు.

వంట అయ్యేసరికి పది దాటింది. సారథి భోజనం కాగానే అత్తగార్ని లేపింది పద్మావతి- "ప్రొద్దుపోయింది భోంచేద్దాం రండి" అంటూ.

"నాకు ఒద్దులేవే తల్లీ, మీరిద్దరూ భోంచెయ్యండి" అంది ఆవిడ.

"అదేమిటత్తయ్యా? కాస్త నలతగా వుంటేమాత్రం అన్నం మానేస్తే నీరసంరాదూ? లేవండి భోంచేద్దాం. మీ అబ్బాయి తినేశారు" అంది పద్మ.

"అబ్బే, నేను తిననమ్మాయ్" అంటూ ఎంత చెప్పినా ఆండాళ్ళమ్మ గారు అన్నం తిననని కూర్చుంది.

చేసేదిలేక పద్మావతి సారథి దగ్గరకెళ్ళి అంతా వివరించి చెప్పి - "ఇదేం ఖర్మ, నిండు ఇంటిలో పస్తు పడుకుంటానంటుందీ" అంటూ విసు క్కొంది.

సారథి చిరునవ్వు నవ్వాడు, పద్మ ఒంటినిండా చీమలు పరుగెత్తాయి.

"భయపడకు పద్మావతీ! అసలు రహస్యం నీవు గ్రహింపవైతివి, రమ్ము నా వెంట" అంటూ పోజుగా బయల్దేరాడు.

"పెద్దమ్మా! భోం చెయ్యవూ! దారే వస్తూ నీకో అరవీశెడు జిలేబీ కొందామనుకుని, మర్చిపోయాను సుమా? రేపు తప్పకుండా తెస్తాన్లే. ఇప్ప టికే పదకొండు కావస్తోంది. లేచి భోం చెయ్యండి" అన్నాడు.

నాగస్వరం వినపడ్డ కొండచిలువమల్లే ఆండాళ్ళమ్మగారు నెమ్మదిగా

కదిలి దుప్పటి తీసేసి లేచి కూర్చుంది. "అయ్యో! నీ పిచ్చి దొంగల్దోలా! నేనేం చిన్నపిల్లనట్రా? జిలేబీలూ అవీ తింటానికి" అంది.

"పెద్దవాళ్ళు చిన్న పిల్లలతోనే సమాన మంటారులే పెద్దమ్మా! మరి లేచి వెళ్ళు. పద్మ వడ్డిస్తోంది."

"తింటాలేరా! తిండికేమొచ్చె! కొడుకులాంటి వాడివని నీతో అంటు న్నానుగానీ నిజంగా జిలేబీ అంటే మహా ఇష్టం సుమా నాకు" అంది ఆండాళ్ళమ్మగారు వరదలై జారుతున్న లాలా జలం గుటకలేస్తూ.

"కాదూ మరి?" పైకి అని—"నీకు విషంకూడా ఇష్టమైతే ఎంత బావుండును!" అనుకున్నాడు సారథి.

ఆండాళమ్మగారు లక్షణంగా లేచి పీటమీద కూర్చుంది. అసలు రహస్యం తెలుసుకున్న పద్మా రతి విస్తుపోయింది.

ఆండాళ్ళమ్మ.గారు అన్నం తింటూన్నంతసేపూ అన్నం మేకుల్లా వుందని, కూర కారం వాసన కొడుతోందనీ సాధిస్తూనే వుంది. ఆవిడ ధోరణికి చిరాకనిపించి జవాబుకూడా చెప్పకుండా గబ గబా నాలుగు ముద్దలు మింగి వంటగది సర్ది గదిలోకిపోయి మంచంమీద కూర్చుంది పద్మ.

"మనిషి హద్దులు మీరుతున్నట్టు వుంది."

"సహిస్తానన్నావ్?"

"బావుంది. నోటి కొచ్చినంతా వాగుతూంటే కూడానా?"

"సరేలే. వింటుంది."

"అవును. చాటు మాటుగా వినే గుణం కూడా వుంది."

సారథి కంఠస్వరం హెచ్చించాడు. "అలా గుసగుస లాడితే బయట కష్టపడి వింటూన్న వాళ్ళకేమైనా వినపడాలంటావా? కాస్త గట్టిగా చెప్పలేవూ?"

పద్మ బిత్తరపోయింది. తలుపు వెనక నిలబడిన ఆండాళ్ళమ్మ అదిరిపడి పిల్లిలా జారుకుంది. తేరుకుని పద్మ విరగబడి నవ్వింది.

మర్నాడు సారథి ఆఫీసు కెళ్తుంటే ఆండాళ్ళమ్మగారు వెనకే వచ్చి సాగనంపుతూ— "అబ్బాయ్! రాత్రి జిలేబీ తెస్తానన్నావ్ కదూ? చూడూ! ఆ పొట్లాంలోనే ఓ మైసూర్ పాక్ ముక్కకూడా కట్టించు కొస్తావూ?" అంది నెమ్మదిగా.

"ఓ రెండు జీళ్ళుకూడా తెస్తాను" అంటూ మెట్లుదిగాడు సారథి.

సాయంత్రం సారధి ఆఫీసునుంచి వచ్చే వేళకు వీధి గుమ్మం కాసింది ఆండాళ్ళమ్మగారు. సారధి వస్తూనే రెండు పొట్లాలు ఆవిడ చేతిలో పెట్టాడు. "ఆదేమిట్రా?" అంటూ మూడోదాన్ని ఆరాతీసింది.

"పద్మకు పూలులే" అన్నాడు సారధి.

"ఆఁ నీకేం మతిపోయిందేమిట్రా? ఏదో పండక్కి, పబ్బానికి గానీ రోజూ భోగం పాపల్లా పూలు సింగారించుకోవటం ఏమిటీ? రోజుకు అణా అయితే మాత్రం నెలకు రెండు రూపాయలు కావూ? ఏ మజ్జిగ నీళ్ళకైనా వస్తాయి."

పూలు అందుకోవాలని వస్తూన్న పద్మ, అత్తగారి మాటలు విని ఆగిపోయింది. "మీరు బాధపడి పోవడానికి మీ సంపాదనేం చిల్లుకానీ బీరు పోవటం లేదులెండి" అంది విసురుగా వెనకనుంచే.

ఆండాళ్ళమ్మగారు వెనక్కి తిరిగి చూసి నవ్వేస్తూ— "అయ్యో! కోపం తెచ్చుకుంటున్నావేమిటే అమ్మడూ? దుబారా ఎందుకని, నీ సంసారం మంచికే అన్నాను సుమా! పూలు నీ కంత ఇష్టమైతే అలానే పెట్టుకోవే తల్లీ! రోజూ దానికి పూలు తెచ్చిపెట్టరా పార్థుడా?" అనేసి పొట్లాలు తీసు కొని పెరట్లోకి వెళ్ళిపోయింది.

ఆండాళ్ళమ్మగారి రంగులు కళ్ళారా చూస్తూ సారధి, పద్మ ఆశ్చ ర్యంతో అయోమయంగా వుండి పోయారు. క్షణానికి సారధి తేరుకొని "పద్మా! పూలు తీసుకెళ్ళు" అన్నాడు.

"నాకేం అక్కర్లేదు" అంటూ విసురుగా గదిలోకి వెళ్ళి పోయింది పద్మ.

"బావుంది. నామీదెందుకూ నీ అలక?" అంటూ సారధి వెనకే వెళ్ళాడు.

"నా కెవరి మీదా అలకలేదు."

"నువ్వెలాగూ అలుగుతావని తెలిసే కట్టిన పూలు తీసుకొచ్చాను" అంటూ మాల తనే పద్మ జడలో సర్దేశాడు. "ఆండాళ్ళమ్మ ఎటువంటిదో తెలిసి కూడా ఆవిడ మాటలు పట్టించు కొంటున్నావా పద్మా!" అంటూ అనునయంగా మందలించాడు.

సారధి పట్ల పద్మకు నిండు నమ్మకముంది, అయినా ఇలా చెప్పుతు

మాటలు ప్రారంభిస్తే ఏమవుతుందో ఎవరు చెప్పగలరు, "ఛ! ఇంత చెడ్డ మనిషా ఆండాళ్ళమ్మ?" అనిపించింది పద్మకు.... అదే క్షణంలో ఆండాళ్ళమ్మగారంటే ఒక రకమైన విముఖత్వం ప్రారంభమైంది.

"బుద్ధి తక్కువ దాన్ని. నేను పట్టుబడితే మాత్రం మీరు ఖచ్చితంగా ఆవిడను తీసుకు రావటానికి వీల్లేదని చెప్పెయ్యకూడదూ? చెప్పేవాటికి చాదస్తమైతే వినేవాడికైనా వివేకముండాలట" అంటూ తప్పు అంతా సారథి మీదే గెంటేసింది పద్మావతి.

"భగవాన్ ! ఆఖరికి తప్పునాదేనా, ఏం? పెద్ద దిక్కువుంటే? కష్టానికి—సుఖానికి; మంచికీ—చెడ్డకీ...."

"నా మొహానికీ-ఈవిడింత చిత్రమైన మనిషని నాకేం తెలుసూ?"

"పోనీలే. ఇది మనకో అనుభవం" అన్నాడు సారథి తేలిగ్గా.

అత్తా-కోడళ్ళిద్దరు యెడమొహం పెడమొహంగా తిరుగుతూంటే సారథికి కనుల పండువుగా, చూడముచ్చటగా వుంది. "ఏడు కొండలవాడా! వెంకటరమణా! గో....విందా! గోహోవిందా! ఆండాళ్ళమ్మకూ, పద్మావతికీ పెద్ద జగడం వస్తే మా బాబిగాడి జుట్టంతా నీ ఎదటే గీయించి నున్నగా బొప్పణం చేయించేస్తాను. తర్వాత మా పద్మావతి చేత మూడు గుప్పెళ్ళ డబ్బులు నీ డబ్బాలో పోయిస్తాను. నేను నా చేతుల్తో పది కొబ్బరికాయలు ధన్‌ధనా మంటూ చితగ్గొట్టేస్తాను. ఆపద మొక్కులవాడా! మా ఇంట్లో ఒక లావుపాటి ఆపదమ్మ బైఠాయించింది. అందుకే నీకు మొక్కు కుంటున్నాను ప్రభో!" అంటూ వడ్డికాసులవాడి పటందగ్గర మొరపెట్టుకున్నాడు సారథి.

★ ★ ★ ★

పద్మావతి ఆండాళ్ళమ్మగారితో మాట్లాడకుండా ఒకటి రెండు రోజులు ముభావంగా తిరిగింది గానీ, కోపాలూ, కావేషాలూ కలకాలం వుండవుగా! అన్నీ మరచి నిత్యకృత్యాల్లో పడిపోయింది.

ఓనాటి సాయంత్రం ఆఫీసు నుండి వచ్చి ఫలహారం కానిచ్చి ఏదో పుస్తకం తెరుచుకొని కూర్చున్నాడు సారథి.

"మహా తీరిగ్గా కూర్చున్నారుగానీ, కూరలేమీ లేవు. బజారుకెళ్ళి తావొచ్చు" అంటూ సంచి తెచ్చి పడేసి ఆజ్ఞాపించింది భార్యామణి.

"ఇప్పుడా ?" అన్నాడు సారథి పుస్తకం వదల్లేక.

"ఆఁ ఇప్పుడే, ఏం ? ఈ పూట అన్నం అక్కర్లేదా?"

"పస్తుకూడా వుంచుతావేం ఖర్మ! సరే! ఓ రెండు రూపాయలు...."

"రెండెందుకూ? ఒకటి ఇస్తున్నాను. చాలు, అదీ పూర్తిగా తగలేసుకు రాకండి! ఓ వీశెడు వంకాయలూ ఓ వీశెడు బీరకాయలూ చాలు" అంటూ ఒక్క రూపాయి నోటు అందించింది.

"మరైతే....మరి...." బుర్రగోక్కుంటూ నిలబడ్డాడు సారథి.

"ఏమిటి మరి?"

"ఓ సిగరెట్టు కాల్చుకుంటాను."

"నిక్షేపంలా కాల్చుకోండి."

"కాదూ! ఈ రూపాయిలోనే ఒక అర్ధణా బెట్టి...."

"కొంటారు, అంతేనా?"

"కనిపెట్టేశావే!"

"అదేం కుదరదు. ఇంట్లో టిన్ను వుండగా మళ్ళా డబ్బులు తగలేసి కొంటానంటారేం?"

సారథి బిక్కమొగం వేసుకున్నాడు. "ఇంట్లోదే తీసుకెళ్ళి బయట కాల్చుకుంటారేమిటి? ఎంచక్కా బజార్లోనే కొనుక్కుంటే...."

పాపం పద్మావతి హృదయం జాలితో నిండి పొర్లిపోయింది. "సరే. తొందరగా వచ్చెయ్యండి" అంటూ ఒక అర్ధణామాత్రం ఖర్చు పెట్టుకోటానికి అనుమతించింది. సారథి "ఓ" అంటూ హుషారుగా ఈల వేసుకుంటూ వెళ్ళిపోయాడు వీధితలుపులు వేసి నవ్వుకుంటూ వస్తూన్న పద్మావతికి ఆండాళ్ళమ్మగారు బుగ్గలు నొక్కుకుంటూ ఎదురుపడింది. "ఇదేం చోద్యమే తల్లీ! నీ ముందు వాడు గడగడలాడి పోతాడేం? సిగరెట్టుముక్క కొనుక్కోవడానికి కూడా నీ అర్డరే కావాలా వాడికి?" అంటూ విస్తుపోయింది.

"అదంతా నాటకం అత్తయ్యా! మీరు నమ్మేశారేమిటి?"

"ఏమోతల్లీ! ఈ కాలం పిల్లలు మొగుళ్ళని కొంగులకే ముడేసుకుని కోతుల్ని ఆడించినట్టు ఆడించుకొంటున్నారు. మా కాలంలో మొగుడనేసరికి గుండెలు దడదడలాడేవి...."

పద్మ నవ్వుతూ వినసాగింది.

ఓ గంటలో సారథి బజారునుంచి వచ్చాడు. ఖర్చు వివరాలు తెలియజేశాడు-"వంకాయలు అరణాలు. దోసకాయలేమో పావలా. పదణాలై

పోయాయా? రూపాయి నోటుకదూ ఇచ్చావూ? ఇంక అరణాలా? ఇంద పావలా?" అంటూ పావలాబిళ్ళ పద్మ చేతితో ఎత్తిపడేశాడు.

"వంకాయలు అరణాలా? మొన్న నేను బేడకే కొన్నాను" అంది పద్మావతి డిటెక్టివ్‌లా ఆరాలుతీస్తూ.

"నయం. అర్ధణాకే కొన్నానన్నావుకాదు. ఇది మీ బొమ్మిడికాదు అమ్మడూ! విశాఖపట్నం, ఇక్కడ బేడ చూపిస్తే వంకాయ బొమ్మ కూడా ఇవ్వరు."

"ఓహో! వంకాయ బొమ్మ ఇక్కడ మూడణాలుంటుందంటారా?"

"ఆరణాలు ఉంటుంది?"

"సరే! లెక్క కానివ్వండి సామీ! మిగతా బేడ ఏమైందీ?"

"బేడా?....మరేమోనూ....బేడేనా?"

"ఆఁ బేడే."

"ఒక స్నేహితుడు కనబడ్డాడే....నన్ను చూశాడే....దగ్గిరికి రమ్మన్నాడే....ఒక స్నేహితుడు కనబడ్డాడే....పిలిచాడే...."

"అబ్బబ్బ! ఇంతకూ యేం చేశాడా స్నేహితుడూ?"

"చాలా కష్టాల్లో వున్నాడే...."

"ఎందులో వున్నాడూ, కష్టాల్లోనా?"

"ఆఁ, చాలా కష్టాల్లో వున్నాడే!"

"మీరు చూశారా కష్టాల్లో వుండటం!"

"లేదే. వాడు బజారుకొచ్చాడు. కష్టాలేమో ఇంటి దగ్గరే ఉన్నాయట, వాడే చెప్పాడే!" చాలా కష్టాల్లో వున్నానూ, ఏమైనా అప్పు ఇస్తావా? అని అడిగాడే....మరీ...."

"మనసంతా కరిగిపోయిందా?"

"కొంచెం కొంచెం కరగటం మొదలు పెట్టిందే. అసలే నా మనసు బోలెడు విశాలం. వారంరోజులకి గానీ పూర్తిగా కరగదు."

"ఆహాఁ, అంత విశాలమా? అయితే ఎంచక్కా అందులో రెండు డాబాలు కట్టించుకోకూడదూ? ఒకటి అద్దెకిచ్చి మరో దాంట్లో మనం వుండొచ్చు. ఈ అద్దె కొంపలో బాధ దేనికి?"

"నేనూ అదే ఆలోచిస్తూంటాను సుమా! చోటు అయితే ఎన్ని డాబాలు కట్టటానికైనా వుంటుందనుకో. మరి పెట్టుబడి?.... ఒకటి చేస్తా

వేమిటి? మీ అన్నను మనకో పదివేలు సర్దమనూ, మనం కావలసినంత చోటు ముదరా ఇద్దాం. ఎలా వుంది?"

"అమోఘంగా వుంది. ఆ విషయం తర్వాత ఆలోచిస్తాను. ముందు ఆ బేడ మాట చెప్పండి."

"చెప్పాను కదే! స్నేహితుడు చాలా కష్టాల్లో వున్నాడనీ."

"అయితే అతనికి ఆ బేడా అప్పిచ్చారా?"

"అమ్మో! బేడ ఇస్తానా? నువ్వు తిట్టవూ? ఓ అణా ఇచ్చేనే!"

"ఓహో! చాలా కష్టాల్లో వున్న స్నేహితుడికి అణా సర్దారా? అదీ అప్పిచ్చారు! నిజంగా ఎంత విశాలం మీ మనసు? అందులో డాబా లేమిటి? థియేటర్లూ - ప్రాజెక్టులూ - యూనివర్సిటీలూ - కాఫీహోటళ్ళూ- సర్వం కట్టి తీరాలి."

"ఇప్పటికి సరిగ్గా గ్రహించావు."

"సరే! మిగతా అణా?"

"మరి నువ్వు అర్ధణా పెట్టి సిగరెట్టు కొనుక్కోమనలా?"

"సరే! అర్ధణా?"

"అర్ధణాయా? అబద్ధం ఎందుకూ? చెప్పనా? సోడా తాగానే."

"ఎందుకూ?"

"సోడా తాగకపోతే వంకాయలవీ ఇవ్వనన్నాడేమరి!"

"ఓహో! కూరలవాడే సోడా షాపు కూడ పెట్టాడన్న మాట."

"మరే! ఇప్పుడంతా ఇలాగే జాయింటు షాపులు పెడుతున్నారు. వెధవది, ఒక వీశెడు కూరగాయలు కొనాలంటే ఒక సోడా తాగాలి."

"అవునవును. మీరు రెండు వీశెలు కొన్నారు కాబట్టి కిళ్ళీ కూడా వేసుకోవాలి."

"రామ! రామ! నేను కిళ్ళీ వేసుకున్నానా?"

"లేకపోతే పెదా లలా ఎర్రగా వున్నాయేం!"

"ఓ! అదా? నా పెదా లెప్పుడూ ఎర్రగా దొండ పళ్ళలాగే వుంటాయి."

"అవును బొత్తిగా సిగరెట్ల మొహం ఎరగవుకదూ? సిగ్గులేకపోతే సరి. బజారు కెళ్ళి రావటానికి బేడ లంచం! పైగా మీ హృదయం చదరపు మైళ్ళ కొద్దీ విశాలం. అవునా!"

సారధి ఠిక్క మొహం వేసుకు నుంచున్నాడు. పద్మ కూరలు లోపలికి తీసుకొస్తూంటే ఆండాళ్ళమ్మగారు గబగబా వెళ్ళి కుంపటి దగ్గర పడింది. పద్మ వంకాయలు తరుగుతూ కూర్చుంది.

గదిలో ఒంటరిగా తిరుగుతూంటే సారధి కేమీ పూసుపోలేదు.

"పద్మా! ఓ సారిలా వస్తావూ?" అని పిలిచాడు.

"వంకాయలు తరుగుతున్నాను, ఎందుకూ?" అంది పద్మ లోపలి నుంచే.

"నా పెన్ను కనిపించటం లేదు."

"బావుంది. నేనేం చేసేదీ?"

"పోనీ జీడిపప్పు డబ్బాలో వుందేమో వెతుక్కోనా?"

పద్మ అత్తగారికి ఫిర్యాదు చేసింది. "చూశారా అత్తయ్యా! ఎక్కడైనా పెన్ను వెళ్ళి జీడిపప్పు డబ్బాలో వుంటుందా! వుష్మాకని జీడిపప్పు తేవడమే గాని, అది పట్టుమని పదిరోజులైనా వుంచరు. ఒట్టి తిండి రంధి! ఏమీ లేనప్పుడు ఓ గ్లాసెడు మంచినీళ్లు ముంచి ఇచ్చినా గడగడా తాగేసి పూరుకుంటారు. ఉండండి వస్తాను." అంటూ తరుగుతూవున్న వంకాయలు ఆపుజేసి లేచి వెళ్ళింది. పద్మ వెళ్లేసరికి పెన్ను పాంటు జేబులో పెట్టేసుకున్నాడు సారధి. పద్మ వెనకే వెళ్ళి జేబులోంచి పెన్ను బయటికితీసి చూపించింది. "ఇదేమిటి?"

"అరె ఇక్కడే వుందే! నేను చూసుకోనే లేదు."

"పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యక బుద్ధిగా కూర్చొని చదువుకోండి. లేకపోతే నానిగాణ్ణి ఆడించండి. వంటకాగానే వస్తాను" అంటూ వెళ్ళిపోతూన్న పద్మ చెయ్యి పట్టుకున్నాడు సారధి.

"అబ్బ! కాసేపు కూర్చో పద్మా! ఏమిటలా దూసుకుపోతావ్?" అన్నాడు బాధగా.

"బావుంది. కూర్చుంటే ఎలా?" అంటూనే కూర్చుంది పద్మ.

"సరదాగా ఇద్దరం కలిసి కుంపటి దగ్గర కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ వంటచేసుకునే వాళ్ళం కదూ? ఏమిటీ ఖర్మ చెప్పు. అక్కడికి రానూలేను; ఇక్కడ కూర్చోనూలేను" అంటూ సొద వెళ్ళబోసుకున్నాడు సారధి.

"ఓయ్! పద్మావతీ! వస్తానని వెళ్ళి అక్కడే కూర్చున్నావేం?

అన్నం వార్చేస్తున్నాను. రా! రా! వంకాయలు తరగాలి" అంటూ వంటింట్లో నుంచి పొలికేకలు పెట్టింది ఆండాళ్ళమ్మగారు.

"అదిగో, ఎలా బొబ్బలు పెడుతోందో, వెళతాను" అంది పద్మ లేవబోతూ.

"సరదాగా వుంటే సహించలేక అలాగే బొబ్బలెడుతుందిలే. వెళ్ళకు." అంటూ ఆపుజేశాడు సారథి.

"ఆవిడకు కోపం వస్తే ఎక్కడి వక్కడే పారేసి ముసుగుతన్ని పడుకుంటుంది. అప్పుడైనా చేసుకోవాలిగా! వెళ్ళిపోతాను, రాత్రికి బోలెడు కబుర్లు చెప్తానులెండి" అంటూ నవ్వింది పద్మ.

సారథి విరక్తిగా పద్మ కొంగు వదిలేశాడు. "ఛీ! ఛీ! పాడు బ్రతుకు నా పెళ్లాం ఓ ఘడియకూడా నా దగ్గర కూర్చోదు. చచ్చిపోతాను."

"అలాగే సిరాబుడ్డిలో పడి చచ్చిపోండి."

"ఛ! సిరా ఒంటినిండా మచ్చలు కట్టేస్తుంది. కాఫీ తెచ్చిపెట్టు. కాఫీ కప్పులో పడి చచ్చిపోతాను."

"కాఫీ అయినా డాగులు పడుతుంది. మంచినీళ్ళు తెస్తాను. వెర్రి వేషాలెయ్యక చక్కగా పుస్తకం చదువుకొంటూ కూర్చోండి" అంటూ వంటింట్లో కొచ్చి కత్తిపీటదగ్గర కూర్చుంది పద్మావతి.

ఆండాళ్ళమ్మగారు ఉల్లిపాయల జల్లెడ ముందు పడేసుకుంది. "పెద్దదాన్ని ఏమైనా చెప్తే కోపం వస్తుందిగాని మగవాడితో సరిసమానంగా వీధి గుమ్మాలెక్కి కూర్చోవడం ఆడదాని లక్షణం కాదే పద్మావతీ! అస్తమానం అంటిపెట్టుకు కూర్చోకపోతే పెళ్ళాలు కాకపోతారా, మొగుళ్ళు కాకపోతారా? నే నొకదాన్ని చాకిరీకి లేకపోతే...."ఆండాళ్ళమ్మగారు పురాణం తెరిచి శ్రావ్యంగా చదువుతోంటే "ఎంత అసూయ మనిషిరా బాబూ!" అనుకొని అత్తగారి వాగుడంతా కుడిచెవితో విని, ఎడమ చెవితో వదిలేస్తూ కూర్చుంది పద్మావతి.

సారథికి మళ్ళీ ఏమీ తోచలేదు. "పద్మా! కాసిన్ని మంచినీళ్లు తెస్తావూ? దాహంతో కాళ్లు పీకుతున్నాయి" అంటూ అరిచాడు.

"ఎందుకలా చెవి కోసిన మేకలా అరుస్తాడూ? విడ్డూరం" అంది ఆండాళ్ళమ్మగారు విసుక్కొంటూ.

పద్మ వంకాయలూ, ఉల్లిపాయలూ తరిగేసి గ్లాసుడు నీళ్లు పట్టుకొని

గదిలోకి వెళ్ళింది. మూతి బిగించుకుని నిలబడి మంచినీళ్లు అందించింది.

"ఏం! అలా ఉన్నావ్?"

"ఎలా ఉన్నాను? బాగానే ఉన్నాను."

"బాగా ఏం లేవుగాని చెబుదూ! నా దగ్గర దాపరికం దేనికి? మళ్ళా ఏమైనా అందా?"

"అస్తమానూ మీ దగ్గర కొస్తున్నానని సాధిస్తోంది. మగవాళ్ళతో సరిసమానంగా వీధిగుమ్మాలెక్క కూర్చోవడం ఆడవాళ్ళ లక్షణం కాదట."

"అవునవును. ఆడవాళ్ళ లక్షణాలేమిటో ఆవిడికి మహాబాగా తెలుసు. అందుకే భర్తగారు కాపరం వదిలి కాశీ పరుగెత్తారు."

పద్మ ఫక్కుమంది, సారథి జత కలిపాడు. నవ్వులన్ని దూసు కొంటూ వంటింట్లోంచి సన్నటి రాగాలాపన వినవచ్చింది. "అయ్యో! దేవు డోయ్! మాటలు పడమని వెళ్ళావా దేవుడోయ్!" అంటూ.

పద్మావతి తృళ్ళిపడింది. పార్థసారధి తెల్లబోయాడు. ఇద్దరూ కలిసి వంటింట్లోకి పరుగెత్తారు.

"ఏమైం దత్తయ్యా?"

"అదేం పెద్దమ్మా ఏడుస్తున్నావ్?"

ఆండాళ్ళమ్మగారు కుంపటి పక్కనే చఱ్ఱున చీదేసింది. "ఏముందిలే నాయనా! అందరూ అన్నమాటే నువ్వూ అన్నావు. ఆ మహారాజు కాశీకి వెళ్తానని నాకు మాత్రం చెప్పారా? చెప్తే చస్తేవెళ్ళనిచ్చేదాన్నా? ఓ రాత్రికి రాత్రి లేచి కట్టుగుడ్డలతో చక్కాపోయారు. తెల్లారి ఎనిమిది గంటలకులేస్తే ఈ పాపిష్టి వార్త చెవిని పడింది. ఇన్ని నీళ్ళయినా గొంతులో పోసుకో కుండా పన్నెండు గంటల దాకా కంటికీ మంటికీ ఏకధారగా ఏడిచాను. ఇరుగమ్మా పొరుగమ్మా బలవంత పెడుతూంటే అ అపరాహ్ణం వేళ నాలుగు మెతుకులు కతికి రాత్రిదాకా భోరుమని ఏడిచాను. నా దేవుడు తిరిగి రావాలని వెయ్యి గడపలున్న మా వూళ్ళో గ్రామకుంకం నోము నోచాను. ఎన్ని చేస్తే ఏం లాభం? నా మంచి గుణం ఎవరికి తెలుసు దేవుడోయ్! నన్ను మాటలు పడమని వెళ్ళావా దేవుడోయ్....డోయ్....డోయ్." అంటూ ఆండాళ్ళమ్మగారు ఇంటి కప్పు యెగరగొట్టేస్తూంటే పార్థుడు బిత్తరపోయాడు.

"నిజంగా నీ మంచి గుణం తెలీక అనేశాను. వూరుకో పెద్దమ్మా!

ఏమీ అనుకోకు పెద్దమ్మా! సరోజ పెళ్ళి కొచ్చినప్పుడు ఆ సూర్యంగాడే చెప్పాడు పెద్దమ్మా! నాకేం తెలుసూ? అంతా నమ్మేశాను. వూరుకో పెద్దమ్మా!" అంటూ పెద్దమ్మ ఎదుటే చతికిలబడి బ్రతిమాలటం ప్రారంభించాడు.

ఆండాళ్ళమ్మగారు బెక్కుతూ బెక్కుతూ ఉండిపోయింది. సారథి పిల్లిలా జారుకున్నాడు. పద్మావతి నోటికి కొంగు అడ్డు పెట్టుకుని కూర గిన్నె కుంపటి యెక్కించింది.

ఆండాళ్ళమ్మగారు తొందరగానే తేరుకోగలిగింది. అంతా మరిచి యెప్పటి ఉద్యోగంలో జాయినయింది.

రాత్రి సారథి భోంచేస్తూంటే పద్మ బాబును బుజాన వేసుకొని పడక గదిలో తిరగసాగింది. ఆండాళ్ళమ్మగారు సారథి దగ్గర జేరింది- "ఒరేయ్ నాయనా! నీకు కోపం రాకపోతే పెద్ద ముండను ఒక మాట చెప్పనా?"

"ఏమిటి పెద్దమ్మా అది?"

"బొత్తిగా అర్ధణాకూ అణాకూ దాని ముందు చెయ్యి జాపటానికి నీకు అభిమానం కాదుట్రా. పోనీ అడగ్గానే గౌరవంగా ఇస్తుందా? లక్ష ప్రశ్నలు వేస్తుంది."

"అదంతా సరదాకి అంటుంది పెద్దమ్మా! అంతే గానీ—"

"ఆఁ! యెన్ని చెప్పు, మొగబిడ్డవు లక్షణంగా సంపాదించుకుంటు న్నావయ్యే! ఆడదాని ముందు చెయ్యి జాపటం బావులేదు సుమీ!"

సారథికి చికాకు వేసింది. "సరేగాని పులుసు వెయ్యి."

పులుసుతో బాటు మరి కొంచెం నెయ్యి కూడా ప్రేమగా వడ్డించింది ఆండాళ్ళమ్మగారు. "నాకు తెలీకడుగుతానూ, జీతం అదీ దాని చేతికే ఇచ్చేస్తా వేమిట్రా?"

"ఎవరికిచ్చేది మాత్రం ఏముందిలే, ఇద్దరం వాడుతూనే ఉంటాం."

"ఆఁ, మగవాడిచేతి బిడ్డా, ఆడదాని చేతి అర్థమూ దక్కవంటారు. లక్షణంగా సంపాదించుకొంటున్న వాడివీ, నీ దగ్గరే అట్టే పెట్టుకోకా.... ఆఁ, వూరికేనే అన్నాననుకో. ఎవరిదగ్గర వుంటే ఏముందిలే."

"అవును, ఎవరి దగ్గరుంటే ఏముంది పెద్దమ్మా! నీదగ్గరున్నా లక్షణంగా వుంటుంది."

"అయ్యో! దానికేం భాగ్యం! అలాగే ఇవ్వరా నిక్షేపంలా వుంచుతానూ!"

సారథి నవ్వుకొంటూ చేయి కడుక్కొని లేచిపోయాడు. పద్మ భోజనానికి వెళ్ళింది. 'ఎప్పుడొస్తుందా? ఆండాళ్ళమ్మగారి అమోఘమైన సలహాలు యెప్పుడు చెబుదామా?' అని యెదురుచూస్తూ కూర్చున్నాడు. పద్మ వచ్చింది. ముభావంగా పక్క సర్దుకొని పడుకొంది. సారథి పద్మ చెయ్యి చేతిలోకి తీసుకోబోతే విసిరికొట్టింది.తెల్లబోయిన సారథి- "ఇదేమిటీ అలక? రాత్రికి యెన్నో కబుర్లు చెప్తానన్నవ్!" అన్నాడు. పద్మ మాట్లాడలేదు.

"పద్మా! ఏమిటిది?" అన్నాడు మళ్ళా, పద్మ అటు తిరిగిపోయింది. సారథికి కోపం వచ్చింది.

"నేనేం చేశానో చెప్పి సాధించరాదూ?" అన్నాడు.

"మీరు ఏమీ చెయ్యలేదు. సాధించటానికి నే నెవత్తెనూ? నిద్ర వస్తుందని పడుకున్నాను. అదీ తప్పే?" అంది వ్యంగ్యంగా.

"తప్పు కాదు. నువ్వు ఏం చేసినా తప్పు కాదు. నీకు సమంజసం అనిపించినట్టే చెయ్యి. కాని పద్మా! నువ్వు ఇంత మూర్ఖంగా ప్రవర్తించి నట్టు నా కెప్పుడూ గుర్తు లేదు" అంటూ సారథి లేచి మడత మంచం వాల్చుకుంటూంటే పద్మ వారించ లేదు. కనీసం చూడనైనా చూడలేదు. మాట్లాడకుండా నిద్రపోయింది.

★ ★ ★ ★

మర్నాడు పగలు కూడ పద్మ అలానే ముభావంగా ఉండిపోయింది. సారథి పలకరించటానికికూడా ప్రయత్నించలేదు. దంపతులిద్దరూ అంటీ అంటనట్టుగా తిరగటం మొదట ఆండాళ్ళమ్మగారికి తగని ఆశ్చర్యం కలిగించినా ఏమిటో అర్థమైనట్టు ముసి ముసిగా లోలోపల నవ్వుకొంది.

ఆ సాయంత్రం జీతం అందుకొని సారథి ఇంటికొచ్చాడు తనంత తనే పద్మను పలకరించాడు. "పద్మా! పర్సు తీసి దాచు" అన్నాడు.

పద్మ కోపం అంతా వెళ్ళగక్కుతూ విసురుగా అంది - "నాకేం అవసరంలేదు. మీరే దాచుకోండి. లేకపోతే మీ పెద్దమ్మగారికి ఇవ్వండి."

"పద్మా!"

"ఏం, మీ గుసగుసలు నేను వినలేదనుకున్నారా?"

సారధి విస్తుబోయాడు. "గుసగుసలా? ఆవిడేదో వాగింది. అది నీకు లెక్కా?"

"కాదు, మీ ప్రవర్తనే నాకు లెక్క! ఎంత లాలూచీ లేకపోతే నన్ను గురించి మీ దగ్గర చెప్పటానికి ఆవిడ ధైర్యం చేస్తుంది? పూలు తేకండి; డబ్బు నా చేతికివ్వకండి; ఆవిడ మీకు ఎకరాలు రాస్తూంది కదూ?"

"నోర్మూయ్!.... ఛీ! ఇంత పశువులా ప్రవర్తిస్తావని ఎన్నడూ అనుకోలేదు. నన్ను అన్ని విధాలా తెలిసి కూడా...." సారధి అరచేతిలో నుదురు ఆన్చి బాధగా కూర్చుండిపోయాడు.

పద్మ క్షణం మౌనం సహించింది. "నూరు రాళ్ళు విసిరితే ఒక్క రాయైనా తగలకపోదు. ఇటువంటి పెద్ద మనుష్యులున్న సంసారాలు బాగు పడ్డట్టే. మీకు మొహమాటం లేదు కాబోలు. ఆవిణ్ణి పొమ్మని చెప్పండి."

సారధి కస్సుమన్నాడు. "చెప్పాలంటే క్షణం పట్టదు. కానీ చస్తే చెప్పను. గుణవంతురాలివీ! సహనవంతురాలివీ! బాధపడిపోతావేం! ఓర్పు నీ సొత్తుకాదూ? ఏమైపోయింది?"

పద్మ కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. దిండులో మొహం పెట్టుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది. పద్మ కళ్ళనీళ్ళు పెట్టుకోవడం సారధి ఎన్నడూ ఎరగడు. ప్రియమైన పద్మ - ప్రాణంవంటి పద్మ - ఏడుస్తోంటే ఎంతో బాధ కలిగింది సారధికి! అయినా నిర్లక్ష్యంగా సిగరెట్టు మీద సిగరెట్టు నుసిచేస్తూ కూర్చున్నాడు. కొంత సేపటికి మరీ ఉండబట్టలేక లేచివచ్చి పద్మ పక్కలో కూర్చుని తల నిమురుతూ బుజ్జగించాడు. "పద్మా? ఛ, ఏమిటిది! మరీ పిచ్చిదానివై పోతున్నావ్!"

"అవును, పిచ్చిదాన్ని కాబట్టే మీ రిద్దరూ మంతనాలు చెయ్యగలుగుతున్నారు."

"పద్మా ! నీ ధోరణి నీ దేనా? నన్ను నమ్ము పద్మా! నీ కన్నా ఆండాళ్ళమ్మ ఎక్కువా నాకు? నా మీద ఇంత నింద వెయ్యటానికి నీ మనస్సు ఎలా అంగీకరించింది పద్మా? నా మాట విను. కొన్నాళ్ళు అనుభవించాలి. సమయం రాకపోదు. నేను మాత్రం పొమ్మని ఎలా చెప్పేది?"

సారధి ఎంత సముదాయించినా పద్మకు ఊరట కలగలేదు.

కన్నీళ్ళతో వేళగానివేళ నిద్రపోయింది.

★ ★ ★ ★

పద్మ తెల్లారి లేచింది మొదలు అత్తగార్ని పలకరించలేదు. వంటపని తానే చూసుకోవటం ప్రారంభించింది. వంట పూర్తయ్యాక చీర ఉతికి ఆరవేసుకుంటూంటే "అమ్మాయ్! నా మడిబట్టకూడా కాస్త నీళ్ళముంచి పెట్టు" అంది ఆండాళ్ళమ్మగారు.

"నేను ఉతకలేను" అంది పద్మ ఖచ్చితంగా. ఆండాళ్ళమ్మగారు కొరకొరా చూసింది. వీలైతే కోడలి పిల్లను కరకరా నమిలిపారెయ్యాలని పళ్లు పటపట లాడించింది. పద్మావతి ఏమీ లెక్కపెట్టకుండా తనపని తాను చూసుకుని గదిలోకెళ్ళి కూర్చుంది.

ఆండాళ్ళమ్మగారి హృదయం అవమానంతో మండిపోయి ఏదైనా ప్రతీకారం చెయ్యమని ప్రేరేపిస్తోంది. పరిపరివిధాల ఆలోచించింది. ఏమీ తోచలేదు. ఉపాయం దొరకకుండానే సాయంత్రమైపోయింది. పద్మ బాబిగాణ్ణి పెరట్లో జామచెట్టుక్రింద కూర్చోపెట్టి వాడిముందు నాలుగుబొమ్మలు పడేసి వంటింట్లోకెళ్ళి కుంపటి అంటించటానికి కూర్చుంది. బాబిగాడు బొమ్మలతో కేరింతలు కొడుతూ ఆడుకోవటం ఆండాళ్ళమ్మగారికి ఏమీ నచ్చలేదు. గబగబావెళ్ళి "మన్ను తింటూవేంరా వెధవా? తెగుళ్లువస్తే ఎవరు ఏగుతా రనుకున్నావ్?" అంటూ వాణ్ణి నాలుగు బాదింది. పసివాడు హడలిపోయి కెవ్వుమని గుక్కపట్టాడు.

కుంపటి అంటిస్తూన్న పద్మ పరుగెత్తుకొచ్చింది. కొడుకు వీపు రాస్తూ గుండెల కదుముకుంది. బాబు గుక్కపెట్టి ఏడుస్తూంటే పద్మ కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

"నా మీద కోపం పసివాడిమీద చూపిస్తారా? చిన్న వెధవను చావబాదటానికి మీ చేతులెలా వచ్చాయి?" అంది గట్టిగా కోపంతో మండిపడుతూ.

"చూసే మాట్లాడుతున్నావటే? వాడు గుప్పిళ్ళ కొద్దీ మట్టి బొక్కుతున్నాడని ఒకటి వేశాను."

"ఛీ! పెద్దవాళ్లయికూడా నోరులేని వెధవ మీద నేరాలు మోపుతారు. వాడు మన్ను తిన్నదీ నిజమే, మీరు చూసిందీ నిజమే. పుట్టిన తర్వాత ఇంతవరకూ దెబ్బపడి ఎరగడు. వాడి భారమేమీ మీరు మొయ్యటం లేదు.

వాణ్ణి మీరు ఎత్తుకోనూ వద్దు; ఆడించనూ వద్దు. వాడి ఒంటిమీద చెయ్యివేస్తే ఊరుకోను" మహంకాళిలా శాసించింది పద్మావతి.

"అయ్యో! అయ్యో! ఎందుకే అన్నిమాటలంటావు? వాణ్ణి మందలించటానికి నేను తగనుటే?"

పద్మ బాబుని బుజాన వేసుకొని గదిలో కెళ్ళిపోయింది. సారథి వచ్చేవరకూ బాబు ఏడుస్తూనే వున్నాడు.

"ఏం? బాబు ఏడుస్తున్నాడు?" అన్నాడు సారథి వస్తూనే. పద్మ మాట్లాడలేదు.

"నిన్నే అడిగేది, ఏమిటా నిర్లక్ష్యం?"

"ఏం చెప్పమంటారూ? మడిపంచె ఊతకనన్నానని కోపం పెట్టుకొని పిల్లణ్ణి చావబాదింది."

"ఎవరూ? పెద్దమ్మా? బాబును కొట్టిందా? నువ్వెక్కడేడుస్తున్నావ్?" మండిపడ్డాడు.

ఆండాళ్ళమ్మగారు తలుపులు గెంటుకు వచ్చేసింది. "ఉన్నమాట నీకు చెప్తాను నాయనా! చిన్న వెధవ మట్టిముద్దలు మింగుతుంటేనూ భయానికి ఒకటి వేశానే అనుకో- ఆ మాత్రానికి నీ పెళ్ళాం నానా మాటలూ అనాలా!"

"వాణ్ణి మేముకూడా ఎన్నడూ కొట్టలేదు పెద్దమ్మా! వాళ్ళమ్మకు కష్టంతోచి అంటే అంటుంది."

ఆండాళ్ళమ్మగారు టక్కున నోరు మూసేసింది. ఎడమొహం పెడమొహంగా తిరుగుతూన్న మొగుడూ పెళ్ళాలిద్దరూ ఒక్కటయ్యారు. తనే వేరు అయింది. నెమ్మదిగా వాళ్ళను మంచి చేసుకోకపోతే వ్యవహారం జెడిసి కొట్టేలావుంది.

సారథి బాబును అందుకొని బుజంమీద వేసుకొని తిప్పుతూ- "మట్టి తిన్నావా బాబూ?" అన్నాడు.

"అవునులే! నీ బిస్కట్లన్నీ అమ్మ తినేస్తూంటే నువ్వు మట్టికాక మరేం తింటావు?" అంటూ వీపు నిమురుతూ బుజ్జగించాడు.

"అయ్యో! నీ సరసం బంగారంగానూ! చిన్నపిల్లాడి బిస్కట్లు అదెందుకు తింటుందిరా?" అంటూ పద్మావతిని వెనక వేసుకొనివచ్చి

పకపకా నవ్వేసింది అండాళ్ళమ్మగారు.

"నీ సిగ్గు చితికినట్టే ఉందిలే" అనుకొని పద్మ కుంపటి అంటించి గబగబా కాఫీచేసి తెచ్చియిచ్చింది సారధికి. బాబు ఏడ్చిఏడ్చి నిద్రపోయాడు. బాబుని పడుకోబెట్టి కాఫీగ్లాసు అందుకొంటూ- "మీ నాన్నగారు ఉత్తరం రాశారు పద్మా! మీ అక్కయ్య వచ్చిందట. నిన్నూ బాబునూ చూడాలంటోందట. ఓ పదిరోజులు పంపమని రాశారు. నా అభ్యంతరం ఏమీలేదు. వెళ్ళిరా! బావుంటుంది" అన్నాడు.

పద్మ మాట్లాడకుండా వూరుకుంది "ఎప్పుడు బయల్దేరి వెళ్ళేదీ మీ నాన్నగారికి ఉత్తరంరాయి. స్టేషన్‌కొస్తారు" అన్నాడు.

"ఈ పరిస్థితుల్లోనా? చస్తే వెళ్ళను" అంది పద్మ.

సారధి అర్థం చేసుకున్నట్టు వూరుకున్నాడు.

"అయ్యో! అదేమే పద్మావతీ! తోడబుట్టింది నిన్ను చూడాలని ఉందనిరాస్తే లక్షణంగా పుట్టింటి కెళ్ళిరాకా? పార్థుడి తిండి తిప్పలూ చూడడానికి నేనున్నాను కాదుటే! బావుండదు. వెళ్ళిరామ్మా! నీ ఇంటి కేం ఫర్వాలేదు" అంటూ కోడలికి అభయం ఇచ్చింది అండాళ్ళమ్మగారు.

"పద్మా! నాకేం ఫర్వాలేదు. నీకు వెళ్ళాలనివుంటే వెళ్ళు" అన్నాడు, సారధి గుంభనంగా 'ఈ అండాళ్ళమ్మ పప్పులు నా దగ్గర వుడకవులే' అన్నట్లు.

"నేను లేకపోతే మీకు కుదరదు. నాకు తెలుసుగాని వేధించకండి" అంది పద్మ విసుగ్గా.

ఎంచక్కా పద్మావతి వెళ్ళిపోతే ఓ పదిరోజులపాటు ఇల్లంతా ఏకఛత్రాధిపత్యంగా ఏలిపారేద్దామనుకున్న అండాళ్ళమ్మగారికి సరదాపోయి కసి పుట్టింది. "ఇదేంచోద్యమే తల్లీ! నువ్వు లేకపోతే వాడికి క్షణం జరగనట్టే చెప్తున్నావ్. మొగవాడికి మడికడతావా ఏమిటే?" అంది చేతులు తిప్పుతూ.

పద్మావతికి కోపం వచ్చింది. చిరాకు వేసింది. ఇక అండాళ్ళమ్మ విషయంలో ఉపేక్ష చెయ్యకూడదనిపించింది. 'తమ దాంపత్యంలో కలతలు రేపటానికి ఆవిడ చేస్తున్న ప్రయత్నాలన్నీ వ్యర్థం సుమా' అని- ఆవిడకు బోధపడేలా చెప్పాలనిపించింది. అందుకే గర్వంగా అంది—"నా మొగుడికి మడే కడతానో, దడే కడతానో, మా దాంపత్యం మీ రనుకున్నంత

తేలికైంది మాత్రంకాదు. మా ఇద్దరికీ ఒకటే బ్రతుకు- ఒకటే చావు" అంది.

తమ దాంపత్యాన్ని గురించి పద్మ అంత బలీయమైన అభిప్రాయం కలిగి ఉన్నందుకు పార్థసారథి సంతోషంతో మూగవాడయ్యాడు.

కాని ఆండాళ్ళమ్మగారు మాత్రం ఫకాళించి నవ్వింది, పోయేకాలం వచ్చినదానిమల్లే. "నా దగ్గర చెప్తావుటే నీ సంసారం గొప్పలూ! బ్రతికున్నంత కాలం అంతా మోజుగానే వుంటారు. కన్నుమూస్తే అంతాసరి. నీ అత్తగారు చస్తే నీ మామ మడికట్టుకున్నాడా? ఏడాది తిరక్కుండా మరోదాన్ని తెచ్చుకున్నాడు. అలాగే నువ్వు...."

"పెద్దమ్మా!" పిచ్చిగా అరిచాడు పార్థసారథి.

ఆండాళ్ళమ్మ కంపించిపోయింది. పద్మ ప్రతిమలా నిలబడిపోయింది.

"మాట పడసకు....ఏదో.... పెద్దముండని."

"ఛీ! నోర్ముయ్ బుద్ధిలేనిదానా! ఇంకా వాగుతున్నావ్. నీ పెద్దరికం అనుభవించి సుఖపడ్డాం. ఇక చాలు. తక్షణం బయటికి నడు. ఒక్క క్షణం కూడా నా ఇంట్లో వుండటానికి వీల్లేదు-" సారథి హద్దులుమీరిన కోపంతో దాదాపు ఒళ్ళు మర్చిపోయాడు.

ఆండాళ్ళమ్మగారు గజగజా వణుకుతూ చతికిలపడిపోయింది. లేని ధైర్యం పుంజుకుని—"ఎందుకురా అలా కేకలేస్తావు? నే నేం కాని మాట అన్నాననీ?" అంది నెమ్మదిగా.

"నువ్వేన్ని చెబుతున్నా వినను. ఇకచాలు. నీకూమాకూ సరిపడదు. మూటాముల్లె సర్దుకుని వెళ్ళిపో. నువ్వు మా ఇంట్లో వుండడానికి వీల్లేదు."

ఆండాళ్ళమ్మగారికి పౌరుషంవచ్చి, లేచి నిలబడింది. "ఏమిట్రా? ఛో ఛో అంటావ్ కుక్కను తరిమినట్టు. నన్నేం వూరికే ఉంచుకున్నావా? బోలెడు రూపాయలువచ్చే కాయితాలు నీ చేతుల్లో పెట్టాను. రెండెకరాలు నీకే రాస్తానన్నాను. నీ కొడుక్కు గొలుసు ఇచ్చాను. అన్నీ...."

"తల్లీ! నీ డబ్బుకూ, నీ ఎకరాలకూ, నీ గొలుసుకూ, నీకూ తలొక పదివేల నమస్కారాలు. మమ్మల్ని వదిలిపెట్టు. నీ పాపిష్టి సొమ్ము చిల్లిగవ్వ నా కొద్దు. నీ సరుకులన్నీ తీసుకొని బయల్దేరు- పద్మా! డ్రాయరు సొరుగులో ఆ కాయితాలు ఉన్నాయి చూడూ! ఆ గొలుసుకూడా తెచ్చి పడేయ్. తొందరగా రా! లేకపోతే మనమీద ప్రచారం చేస్తుంది."

పద్మ ప్రతిమరూపం విడిచి తొందర తొందరగా డ్రాయరులో కాయితాలూ, నిద్రపోతున్న బాబిగాడి మెడలో గొలుసూ, చిలక్కొయ్యకు వేలాడుతున్న నల్లసంచి, అలమార్లో దాచి వుంచిన తెల్లసంచీ, కూరగాయలు వేసివున్న మేదరబుట్టా, వంటింటి అలమరలోంచి మరచెంబూ, తలగడగా ఉపయోగించుకునే గుడ్డలమూటా, ఆండాళ్ళమ్మగారి వస్తువులు సర్వం ఆవిడచుట్టూ పోగేసింది.

"మొన్న నేను కొన్న కంచుచెంబు దాచుకుందామనుకున్నావుటే?అదీ ఇలా పారేయ్-"ఆండాళ్ళమ్మగారు గర్జించింది. పద్మ తన మతి మరుపుకు తిట్టుకొని గబగబా అలమారులో కొత్త చెంబుకూడా తీసుకెళ్ళి దగ్గర పెట్టింది.

"నీ సరుకులన్నీ వున్నాయి. ఇక బయల్దేరు" అన్నాడు సారథి.

ఆండాళ్ళమ్మగారు బిక్క మొహం వేసుకొంది. చీకటి పడిపోతోంది. ఇప్పుడెక్కడికి వెళ్ళమంటావురా పార్థుడూ?" అంది కళ్ళు ఒత్తుకుంటూ.

"నిన్ను ఎవరూ భరించలేరు. ఆ సూర్యం దగ్గిరికే వెళ్ళు"అన్నాడు సారధి.

ఆండాళ్ళమ్మగారు కస్సుమంది. "ఆ వెధవ దగ్గిరకి వెళ్ళడానికి నాకేం ఖర్మ? నువ్వూ వాడే బయల్దేరారు బుద్ధిమంతులు! నా ఇష్టం వచ్చిన చోటికి పోతాను. నా ఆస్తంతా నా ఇష్టం వచ్చిన వాడికి ధారపోస్తాను."

"అవునవును! సూర్యం కూతురుకు గొలుసుచేయించినట్టూ, సరోజకు టెండెకళాలూ చదివించినట్టూ - సరే! నీ ఇష్టం వచ్చిన చోటికే వెళ్ళు. కాని వెళ్ళపోయేముందు నాలుగు ముక్కలు చెప్తాను. కాస్త శ్రద్ధగా విని మరీ వెళ్ళు!

నీకువయసు పెరుగుతోంది కానీ గుణం తరుగుతోంది.అన్ని విధాలా లక్షణమైన నీకాపురం నువ్వు నిలుపు కోలేక సర్వ నాశనం చేసుకున్నావు. అలాగే అందరి కాపురాలూ నాశనం చెయ్యాలని కంకణం కట్టుకున్నావు. నిన్ను పువ్వుల్లో పెట్టి చూసే వాళ్ళన్నా అందరితోనూ అల్లరి పడుతూ బంధుజనోద్ధరణకని బయల్దేరావు. ఏ సంసారం పచ్చగా వున్నా, ఏ భార్యాభర్తలు సుఖంగా వున్నా నీ కళ్ళు ఓర్చలేవు. ఏదో విధంగా వాళ్ళను విడదియ్యటానికీ, ఆ సంసారంలో దోసెడు నీళ్ళు పొయ్యటానికి తాపత్రయ

పడతావు.

నీ గురించి నాకు ముందే అంతా తెలుసు. నువ్వు వస్తావని ఉత్తరం రాస్తే నాకు సుతరామూ ఇష్టం లేదు. కాని, పద్మ నీ పెద్దరికంలో సుఖపడాలని ఉబలాట పడింది. దాని కోరిక కాదనలేక సరే అన్నాను. నిన్ను రమ్మని జవాబూ రాయలేదు, గివాబూ రాయలేదు. అయినా నువ్వు వచ్చింది మొదలు నిన్ను గౌరవించి ఆదరించటానికే ప్రయత్నించాం. నువ్వు సజావుగా వుంటే కన్నతల్లిలా కాపాడుకునే వాడిని— అటువంటి విషయాలు నీకు అర్థమే కావు. నీవల్ల సుఖపడింది లేదు సరిగదా మా ప్రాణాలకొక పెనుభూతంలా తయారయ్యావు. నీ గురించే మా ఇద్దరిలో ఎన్నడూ ఎరగని మనస్పర్థలు కూడా పుట్టుకొచ్చాయి. భగవంతుడి దయవల్ల చేతులు కాలక ముందే కళ్ళు తెరవగలిగాను. నువ్వు మా ఇంట్లోంచి వెళ్ళిపోతే చాలు! ఒక్క మాట పెద్దమ్మా! నువ్వంటే నా కెప్పుడూ సద్భావం లేదు. కాస్తోకూస్తో ఉన్నా అది ఈ క్షణంతో సరి. అందుకే ఇంత నిర్మోహమాటంగా ఇన్ని మాటలు అన గలుగుతున్నాను. ఇక వెళ్తావా?"

"అయ్యో ! అయ్యో ! ఎంత లేని మాటలన్నావురా ! ఎంతలేని మాటలన్నావురా ! ఈ జన్మలో మరిచిపోతానట్రా?"

"మర్చిపోకు....మర్చిపోతే మళ్ళా వస్తావు. పెద్దమ్మా! నిన్ను చూసి నవ్వాలో ఏడవాలో అర్థంగాని మనిషివి. ఎందుకిలా పదిమందిలోనూ అల్లరి పడతావు చెప్పు! నీ తోటి వాళ్ళంతా ఎంత లక్షణంగా బ్రతుకుతున్నారో నీకు తెలీదా? నువ్వు ఎక్కడో ఒకచోట స్థిరంగా, సుఖంగా ఎందు కుండలేవు? అర్థం లేని అధికారాలు ఎవరు సహిస్తారు? నీ ఆస్తిపాస్తులు ఎరపెట్టి మనుషుల్ని కొనాలని చూస్తావే, అంత పలికి మాలిన వాళ్ళెవ రుంటారు? మనిషి జన్మ ఎత్తావు? అందులోనూ ఎన్నో కష్టసుఖాలు, మంచిచెడ్డలు భరించాల్సిన ఆడపుటక పుట్టావు. ఏ విషయంలోనైనా స్త్రీ వనిపించు కోగలిగావా? పది మందికీ చెరుపైతే నీ జన్మకు సార్థకం ఏమిటి? ఇక నుంచైనా కాస్త జ్ఞానం తెచ్చుకుని...."

"ఒరేయ్! నీ నీతులు నాకక్కర్లేదు నీ పెళ్ళానికి చెప్పుకో. నే నెలాగూ చెడ్డ ముండనే. నా ఇష్టం వచ్చినట్టువుంటాను" అంటూ పౌరుష పడింది ఆండాళమ్మగారు.

రెండు నిమిషాల్లో సామానంతా సర్ది కట్టుకొంది. ఎందుకో కళ్ళు

చెమర్చుతోంటే కొంగుతో తుడుచుకొంది. సంచులూ - మూటలూ - చెంబులూ అన్నీ తగిలించుకొని నాలుగడుగులు వేసింది.

ఆవిడ స్థితి చూస్తోంటే పద్మకు జాలి వేసింది. "పోనీ ఈ ఒక్క రాత్రికి వుండనివ్వరా. రేపు ఉదయమే వెళ్ళిపోతుంది" అంది నెమ్మదిగా సారధితో.

వీల్లేదని తల అడ్డంగా ఆడించాడు సారధి.

ఆండాళ్ళమ్మగారు వెక్కుతూ వెక్కుతూ మెట్లుదిగి రోడ్డుమీద కెళ్ళింది. సారధీ, పద్మా వీధి గుమ్మంలో చూస్తూ నిలబడ్డారు. చూస్తూ వుండగానే ఆండాళ్ళమ్మగారు కనుచూపుమేర దాటి పోయింది.

పద్మ కళ్ళ నుంచి నీళ్ళు జారిపడ్డాయి. "ఈ గొడవంతా నేనే తెచ్చి పెట్టుకున్నాను" అంది పద్మ, చెంపలు తుడుచుకొంటూ.

సారధి కూడాబాధగా నిట్టూర్చాడు. "ఆవిడ ఎంత చెడ్డదైనా ఏమిటో మనకు దూర మౌతుంటే బాధగా వుంది. ఇది ఏ నాటికైనా జరిగి తీరాలి పద్మా! ఆవిడను భరించాల్సింది మనం కాదు." ఒక్కసారి నిట్టూర్చి చప్పున తేరుకున్నాడు.

"అయితే ఆండాళ్ళమ్మ వెళ్ళి పోయిందన్న మాట.నాకింకా నమ్మకం కలగటం లేదేం ఖర్మ? ఈ నాటి నుంచీ మన ఇంటిలో సుఖశాంతులూ, మనకు సర్వ స్వతంత్రాలూ వుంటాయన్నమాట. అంతేనా?" అన్నాడు సారధి కాస్త హుషారు చేస్తూ.

పద్మ ముభావంగా నవ్వింది.

"చ ! నువ్వు ఇంకా బాధపడతావెందుకూ ? ఆవిడ కేం ఫర్వా లేదు. ఎక్కడికి వెళ్ళాలనుకుంటే అక్కడికి లక్షణంగా జేరుతుంది. ఈ తిరుగుళ్ళన్నీ అలవాటే. అన్నట్టు ఆవిడ నీకు ఆ రిషా పావలా ఇచ్చిందీ?"

"పోదురూ?" అంటూ నవ్వేసింది పద్మ.

"అబ్బ! నాలుగు పూటల నుంచీ నవ్వే కరువు జేశావ్ !" అంటూ పద్మని దగ్గరకి తీసుకున్నాడు సారధి.

"నేను మా వూరు వెళతాను. మా అక్కని చూడాలని వుంది."

"ఓ, నీ ఇష్టం. కాని మీ అక్క ధ్యాసలో పడి నన్ను మర్చి పోకుండా పది రోజుల్లో వచ్చేస్తే—"

"మీరు ఎంత మంచి వారండీ!" అంది పద్మ హాస్యంగా.

"అవునట. అంతా నన్ను అలానే అంటారు."

"ఒక్క ఆండాళమ్మ తప్ప...." నవ్వింది పద్మ.

"ఆండాళ్ళమ్మ మనకు విడిచిపోయిం దేమిటో తెలుసా? మహా చెడ్డ పేరూ- ఏభై రూపాయల అప్పూ- వేంకటేశ్వరుడి మొక్కూ....గోవిందా! గోహోవిందా!"

—:o:—